www.vishalabharati.com
epaper:vishalabharati.com

ఆదివారం, హైదరాబాద్
15 అక్టోబర్ 2023
సంపుటి:1 సంచిక:350

# విశాల భారతి

తెలుగు దినపత్రిక



## హైదరాబాద్ రేంజే వేరు..

- సింగిల్ బెడ్రూం ఇండ్లకు చెల్లుచీటి
- పెరుగుతున్న ధరలకు అనగుణంగా పెద్దింటి -నిర్మాణాలకే బిల్డర్లు మొగ్గు
- విలాశమైన, విలాసవంతమైన ఇండ్లకు పెరుగుతున్న ఆదరణ



### సీఎం ప్రజా ఆశీర్వాద సభకు

## సర్వం సిద్ధం

- బీఆర్ఎస్ ను మరోసారి ఆశీర్వదించండి
- సంక్షేమం, అభివృద్ధిలో తెలంగాణ నెంబర్ వన్
- ఏర్పాట్లను పరిశీలించిన రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ వినోద్ కుమార్ , ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్

**విశాలభారతి, తెలంగాణ బ్యూరో :** సీఎం కేసీఆర్ ప్రజాఆశీర్వాద సభకు సర్వం సిద్ధమైంది. హుస్నాబాద్ లో శనివారం నిర్వహించనున్న సభకు ఎమ్మెల్యే సతీష్ కుమార్ దగ్గరుండి ఏర్పాట్లను చేయిస్తున్నారు. బహిరంగ సభ వేదికకు ఎడమ వైపు హెలిప్యాడ్ నిర్మించారు. మహిళలకు, దివ్యాంగులకు, వీఐపీలకు ప్రత్యేకంగా గ్యాలరీలు నిర్మించారు. సుమారు లక్ష మంది హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి ఈ సభకు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. హుస్నాబాద్ మున్సిపాలిటీ 20 వార్డుల నుంచి ప్రజలు ర్యాలీగా తరలివస్తారని, నియోజకవర్గంలోని ఏడు మండలాలు అన్ని గ్రామాల నుంచి మహిళలు, నాయకులు, అభిమానులు ప్రజలు తరలివస్తారని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని ఎమ్మెల్యే సతీశ్కుమార్ తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని అనేక సంక్షేమ

..మిగతా | 2 | లో



### తెలంగాణ ప్రజల కొంప ముంచింది

## చేపల పులుసే..

### కేసీఆర్.. నంబర్ వన్ దొంగ, బట్టేబాజ్

- ఆయన నోటి నుంచి ముత్యాలు కాదు.. మందు రాలుతుంది
- 3+3=6.. బీఆర్ఎస్ ఇంటికి పోవడం ఫిక్స్
- కేసీఆర్ కు మీటర్లు పెడతాం:బండి సంజయ్

**తెలంగాణ బ్యూరో,విశాల భారతి:**

ఇకపోతే తెలంగాణ ప్రజల కొంప ముంచింది మొత్తం చేపల పులుసేనని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ ఎద్దేవాచేశారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో శనివారం నిర్వహించిన బీజేపీ రైతు సదస్సుకు ఆయన హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కృష్ణా నదీ జలాల్లో 550 నుంచి 570 టీఎంసీల వాటా తెలంగాణ ప్రాంతానికి రావాలని, కానీ చేపల పులుసు వల్ల తెలంగాణకు 292 టీఎంసీల నీళ్లకే సీఎం కేసీఆర్ సంతకం చేశారని బండి సంజయ్ ధ్వజమెత్తారు. ఆయన చేస్తే సంసారం.. ఇతరులు చేస్తే వ్యభిచారం అన్నట్లుగా కేసీఆర్ తీరు మారిందని ఫైరయ్యారు. యావత్ దక్షిణ తెలంగాణ ప్రజలను మొత్తం ముంచారని విరుచుకుపడ్డారు. విభజన సమయంలోనే కేసీఆర్.. పైసలు, కమీషన్లకు లాలూచీ పడి కేవలం 570 టీఎంసీలకు బదులు 292 టీఎంసీలకు సంతకం పెట్టారని ధ్వజమెత్తారు. ఆపై 9 ఏండ్లు కేంద్రానికి ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని

..మిగతా | 2 | లో

> తెలంగాణ కాంగ్రెస్ అభ్యర్థుల తొలి జాబితాను ఆదివారం విడుదల చేయనున్నట్లు స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మురళీధరన్ వెల్లడించారు. 58 మందితో తొలి జాబితాను విడుదల చేయనున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమరానికి కాంగ్రెస్ వ్యూహాత్మకంగా తొలి జాబితాను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. అధికార బీఆర్ఎస్ వ్యూహాలకు ధీటుగా అభ్యర్థులను ఎంపిక చేసినట్లు సమాచారం. ఇప్పటికే తెలంగాణ ఎన్నికల షెడ్యూల్ వచ్చిన నేపథ్యంలో అభ్యర్థుల జాబితాతో పాటు అనుసరించాల్సిన వ్యూహాలపై మేధోమథనం చేస్తోంది.

# నేడే కాంగ్రెస్ తొలి జాబితా

### 58 మంది అభ్యర్థులతో ప్రకటన



- ఈ నెల 18 నుంచి కాంగ్రెస్ ప్రచారం
- బస్సుయాత్రతో ప్రజల్లోకి కాంగ్రెస్ ముఖ్యనేతలు
- ఈనెల 18న కొండగట్టుకు రాహుల్, ప్రియాంక
- అంజన్న ఆశీస్సులతో బస్సు యాత్ర ప్రారంభం
- బస్సు యాత్రలోనే కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల

**హైదరాబాద్,విశాలభారతి:**

ఇప్పటికే అభ్యర్థుల జాబితాపై పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ కసరత్తు పూర్తి చేసింది. దాదాపు 58 మంది అభ్యర్థులతో తొలి జాబితాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఏకాభిప్రాయంతో ఉన్న సీట్లను తొలిజాబితాలో ప్రకటించనున్నట్లు సమాచారం. అభ్యర్థుల ఎంపికలో కాంగ్రెస్ అధిష్టానం జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలుస్తోంది. అభ్యర్థుల మధ్య తీవ్ర పోటీ ఉన్న నియోజకవర్గాల విషయంపై మరింత లోతుగా స్క్రీనింగ్ కమిటీ కసరత్తు చేసింది. త్వరలోనే మిగతా వారి పేర్లతో కూడిన జాబితాను కూడా విడుదల చేస్తారని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.

అభ్యర్థుల ప్రకటన అనంతరం ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేయాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఈ నెల 18 నుంచి కాంగ్రెస్ ముఖ్యనేతలు బస్సుయాత్ర చేపట్టనున్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు మూడు రోజులపాటు బస్సు యాత్రలో పాల్గొంటారని సమాచారం. రాహుల్, ప్రియాంక గాంధీ ఈ నెల 18న కొండగట్టు అంజన్నను దర్శనం చేసుకుని, బస్సు యాత్రను ప్రారంభిస్తారు. కొండగట్టు నుంచి జగిత్యాల వరకు జరిగే రోడ్ షోలో రాహుల్, ప్రియాంక పాల్గొంటారు. కరీంనగర్, నిజామాబాద్, జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో కాంగ్రెస్ నేతల బస్సు యాత్ర ఉంటుందని పార్టీ వర్గాలు తెలిపాయి. బస్సు యాత్రను తొలిదశలో నాలుగు రోజుల పాటు నిర్వహించాలని కాంగ్రెస్ నేతలు వివిధ కార్యక్రమాలను ప్లాన్ చేశారు. ఈ ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా కాంగ్రెస్ నేతలు పట్టుదలతో ప్రచారం చేస్తున్నారు. బస్సు యాత్రలోనే కాంగ్రెస్ మేనిఫెస్టోను అగ్రనేతలు రాహుల్, ప్రియాంక విడుదల చేయనున్నారని తెలుస్తోంది.



## నిరుద్యోగులారా.. ఆత్మహత్యలు వద్దు

### అధైర్య పడవద్దు..బతికి సాధిద్దాం

- వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..
- కడుపు నిండా ఉద్యోగాలు ఇచ్చుకుందాం
- కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్, ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**ఢిల్లీ, విశాల భారతి :**

''నిరుద్యోగులారా బతికి సాదిద్దాం.. ఎవరూ ఆత్మహత్య చేసుకోవద్దు..వచ్చేది మన ప్రభుత్వమే.. కడుపు నిండా ఉద్యోగాలు ఇచ్చుకుందాం.. చేతులెత్తి మొక్కుతున్నా.. తల్లిదండ్రులకు కడుపు కోత మిగిల్చకండి." అని నిరుద్యోగ యువతకు కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెయినర్, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. గ్రూప్ 2 వాయిదాతో వరంగల్ కి చెందిన ప్రవళిక ఆత్మహత్య చేసుకోవడం పట్ల ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యనే అని, ప్రవళిక ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుణ్ణి

..మిగతా | 2 | లో



### బ్లాక్ మనీని వైట్ చేసుకునే

## పనిలో కేసీఆర్

- కొడుకును సీఎం చేయడమే ఏకైక లక్ష్యం
- కేంద్రం.. రాష్ట్రానికి 7 లక్షల కోట్ల అప్పిచ్చింది
- పెండింగ్ ప్రాజెక్టులు కూడా పూర్తిచేసేందుకూ అండగా ఉంటాం
- ఏ నిర్ణయం తీసుకున్నా అది ఓట్ల కోసం కాదు:కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్,విశాలభారతి:**

ముఖ్యమంత్రి కేసీఆర్ ఫాంహౌజ్ లో బ్లాక్ మనీని వైట్ మనీ చేసుకునే పనిలో ఉన్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో శనివారం నిర్వహించిన బీజేపీ రైతు సదస్సుకు ఆయన హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడారు. అంతేకాకుండా కొడుకు మంత్రి కేటీఆర్ ను ముఖ్యమంత్రిని చేయడమే

..మిగతా | 2 | లో



## ప్రేమ వ్యవహారంతోనే ప్రవళిక సూసైడ్

- ప్రెస్ మీట్ లో డీసీపీ వెంకటేశ్వర్లు
- 15 రోజుల కిందటే హాస్టల్‌లో చేరిందని వెల్లడి
- లవర్ మోసం చేయడంతోనే ప్రవళిక ఆత్మహత్య
- వాట్సప్ ఛాటింగ్, సీసీటీవీ పుటేజీలతో స్పష్టత

**హైదరాబాద్,విశాలభారతి:**

గ్రూప్2 అభ్యర్థిని ప్రవళిక ఆత్మహత్య ఉదంతం కేసుపై డీసీపీ వెంకటేశ్వర్లు శనివారం సాయంత్రం ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రవళిక ఆత్మహత్యకు ప్రేమ వ్యవహారమే కారణమని తెలిపారు. ప్రవళిక 15 రోజుల కిందటే హాస్టల్‌లో చేరిందని పేర్కొన్నారు. ఆమె శివరామ్ రాథోడ్ అనే వ్యక్తిని ప్రేమించింది. ఆ సంగతి ఆమె తల్లిదండ్రులకు తెలుసు. కానీ, అతను ఆమెను మోసం చేశాడు. వేరే అమ్మాయితో ఎంగేజ్‌మెంట్ చేసుకున్నాడు. అది తెలిసి ప్రవళిక డిప్రెషన్‌లోకి వెళ్లింది. వాట్సప్ ఛాటింగ్, సీసీటీవీ పుటేజీలతో ఈ వ్యవహారం బయటపడింది. అది తట్టుకోలేక ప్రవళిక ఆత్మహత్య చేసుకుంది అని డీసీపీ వెంకటేశ్వర్లు తెలిపారు.సూసైడ్ నోట్ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్టు తెలిపారు. శివరామ్‌తోనే ఆమె చివరిసారిగా కాల్ మాట్లాడిందని, పూర్తి దర్యాప్తు తర్వాత అతనిపై చర్యలు ఉంటాయని డీసీపీ స్పష్టం చేశారు. ప్రవళిక మృతికి.. పరీక్ష వాయిదాకి ఎలాంటి సంబంధం

..మిగతా | 2 | లో

## కలిసి పనిచేద్దాం రండి


- సముచిత స్థానం కల్పిస్తాం..
- పొన్నాలకు మంత్రి కేటీఆర్ ఆఫర్
- సీఎం కేసీఆర్ సూచన మేరకు బీఆర్ఎస్ లోకి ఆహ్వానం



**విశాలభారతి,తెలంగాణ బ్యూరో:**

మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్యతో మంత్రి కేటీఆర్ భేటి అయ్యారు. శనివారం ఎమ్మెల్యే దానం నాగేందర్, దాసోజు శ్రవణ్తో కలిసి కేటీఆర్ హైదరాబాద్లోని పొన్నాల నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీలోకి రావాలని లక్ష్మయ్యను ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ సూచన మేరకు పొన్నాల లక్ష్మయ్యను బీఆర్ఎస్ పార్టీలో చేరాలని కోరామని, ఆయన ఆదివారం సీఎం కేసీఆర్తో భేటి అవుతారన్నారు. జనగామలో జరిగే బహిరంగ సభలో బీఆర్ఎస్లో చేరాలని కోరగా అందుకు సుముఖత చూపారన్నారు. సీఎం కేసీఆర్తో మాట్లాడిన తర్వాత పొన్నాల నిర్ణయం ప్రకటిస్తానని పేర్కొన్నారు. పొన్నాల లక్ష్మయ్యకు పార్టీలో సముచిత గౌరవం, ప్రాధాన్యం ఇస్తామని,

..మిగతా | 2 | లో



### శవాలమీద పేలాలు ఏరుకోవడం

## రేవంత్ కు అలవాటే

- ప్రవళిక ఆత్మహత్య నిజంగా బాధాకరం
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ...కవిత వర్సెస్ రేవంత్ ట్విట్టర్ వార్

# సీఎం ప్రజా ఆశీర్వాద సభకు సర్వం సిద్ధం

మొదటిపేజీ తరువాయి

పథకాలు అమలు చేస్తున్నామని, సాగునీటి కోసం ప్రాజెక్టులు నిర్మించుకున్నామని, ఇంటింటికీ తాగునీరు మిషన్ భగీరథ ద్వారా అందిస్తున్నామని, గ్రామాల్లో అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ వినోద్కుమార్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ ప్రభుత్వానికి హ్యాట్రిక్ విజయాన్ని అందిస్తాయన్నారు. సంక్షేమం, అభివృద్ధిలో తెలంగాణ నెంబర్ వన్గా నిలిచిందన్నారు. మూడోసారి హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలు సతీశ్కుమార్ను ఆశీర్వదించాలన్నారు.

# నిరుద్యోగులారా.. ఆత్మహత్యలు వద్దు

మొదటిపేజీ తరువాయి

ప్రార్థిస్తున్నానన్నారు. ఆమె ఆత్మహత్య ను తీవ్రంగా ఖండిస్తున్నానని, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు కూడా ఆమె ఆత్మహత్య ను ఖండించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రవళిక కుటుంబానికి న్యాయం చేయాలని, వారి కుటుంబానికి రూ. 1కోటి ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల కోసం నిరుద్యోగులు చనిపోతుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఫైర్ అయ్యారు. "పదేళ్ల లో ఒక్క గ్రూప్ పరీక్ష నిర్వహించలేకపోవడం సిగ్గుచేటు. నీళ్లు నిధులు,నియామకాల కోసం జరిగిన తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగాల కోసం చచ్చిపోతున్నారు. ఉద్యోగాల కోసం యువకులు పిచ్చోళ్ళలాగా తిరుగుతూ కుటుంబాలకు దూరం అవుతున్నారు. నిరుద్యోగుల ఉసురు ముట్టి ఈ ప్రభుత్వం మట్టి కొట్టుకపోతుంది. నిరుద్యోగులారా రెండు నెలలు ఓపిక పట్టండి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని ఉద్యోగాలు అత్యంత పారదర్శకంగా ఇస్తాం.." అని కోమటిరెడ్డి హామీ ఇచ్చారు.



# కలిసి పనిచేద్దాం రండి

మొదటిపేజీ తరువాయి

పొన్నాల 1960లోనే అమెరికాలో ఉన్నత విద్యాభ్యాసం చేసి, నాసా లాంటి అంతర్జాతీయ సంస్థల్లో ఇంజినీర్గా పనిచేశారన్నారు. అలాంటి సీనియర్ నాయకుడిపై పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి దిగజారి మాట్లాడటం సరికాదన్నారు. 'చచ్చే ముందు పార్టీ మారడం అనడమేంది. ఎవరు ఎప్పుడు చనిపోతారో ఎవరికి తెలుసు. ఇది మంచి పద్ధతి కాదు. రేవంత్ రెడ్డి నువ్వు ఎన్ని పార్టీలు మారలేదు. మొదట బీజేపీ ఆ తర్వాత ఆర్ఎస్ఎస్, టీఆర్ఎస్, ఆ తర్వాత టీడీపీ, ఇప్పుడు కాంగ్రెస్, రేపు.. ఏ పార్టీలోకి వెళ్తారో ఎవరికీ తెలీదని, అలాంటి వ్యక్తి కూడా పెద్ద పెద్ద మాటలు మాట్లాడితే చూసే వాళ్లు నవ్వుకుంటున్నారు. కనకపు సింహాసనంపై ఓటుకు నోటు కేసు దొంగను కూర్చోబెట్టారు. కాంగ్రెస్ పార్టీ.. సీనియర్ నేతలకు కనీసం అపాయింట్మెంట్, గౌరవం కూడా ఇవ్వడంలేదు' అని మంత్రి కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు.

## శవాలమీద పేలాలు ఏరుకోవడం
# రేవంత్ కు అలవాటే

**విశాలభారతి స్టేట్ బ్యూరో:** శవాల మీద పేలాలు ఏరుకోవడం పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి అలవాటేనని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. ప్రవళిక ఆత్మహత్య నేపథ్యంలో ఎమ్మెల్సీ కవితను విమర్శిస్తూ పీసీసీ చీఫ్ రేవంత్ ట్వీట్ చేశారు. 'లక్షలాది ఉద్యోగాల భర్తీ అంటే_ _ _ ఎంపీగా ఓడిన మీకు ఆగమేఘాల పై ఎమ్మెల్సీ పదవి ఇచ్చి భర్తీ చేయడమా!? లక్షలాది ఉద్యోగాల భర్తీ అంటే_ _ _ టీఎస్పీఎస్సీ ప్రశ్నాపత్రాలు లీక్ చేసి నిరుద్యోగుల జీవితాలతో ఆడుకోవడమా!?' అంటూ రేవంత్ ట్వీట్ చేశారు. దీనికి కవిత కౌంటర్ ఇచ్చారు. ప్రవళిక ఆత్మహత్య ఎంతో బాధ కలిగించిందని.. ఇలాంటి పరిస్థితి ఏ తల్లిదండ్రులకూ రాకూడదని ఆవేదన వ్యక్తం చేశారు. 'బతుకమ్మ చేస్తాం.. బాధనూ పంచుకుంటాం. బతుకమ్మ పండుగను కించపరిచేలా మాట్లాడటం కాంగ్రెస్కు మాత్రమే సాధ్యం. తెలంగాణ ఆడబిడ్డ ఆత్మహత్యపై రాజకీయం చేయడం మీ విధానమా? నోటిఫికేషన్లకు మోకాలడ్డుతూ నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతున్నదే కాంగ్రెస్ పార్టీ. నోటిఫికేషన్లను అడ్డుకోవడానికి కాంగ్రెస్ విశ్వ ప్రయత్నాలు చేసింది వాస్తవం కాదా? కాంగ్రెస్ కుట్రలను బద్దలుకొట్టి లక్షలాది ఉద్యోగాలను భర్తీ చేసిన ఘనత సీఎం కేసీఆర్కే దక్కుతుంది. గ్రూప్2 పరీక్ష వాయిదా వేయాలని శ్రీధర్ బాబు అసెంబ్లీలో డిమాండ్ చేయలేదా? వాయిదా వేయాలని రేవంత్ రెడ్డి ట్వీట్ చేయలేదా? శవాల మీద పేలాలు ఏరుకోవడం రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్కు వెన్నతో పెట్టిన విద్య. హత్య చేసిన వాళ్లే ఓదార్చుతున్నట్లు ఉంది మీ వ్యవహార శైలి. రేవంత్ రెడ్డి ఆవేదన బూటకం.. కాంగ్రెస్ ఆందోళన నాటకం' అని కవిత పోస్ట్ చేశారు.

# చంద్రబాబు బ్యారక్లో ఏసీ పెట్టండి

- జైలు అధికారులకు ఏసీబీ కోర్టు ఆదేశాలు
- చంద్రబాబుకు శరీరభాగాల్లో దద్దుర్లు, స్కిన్ అలర్జీ
- రాజమండ్రి ప్రభుత్వ వైద్యుల నివేదిక



**విశాలభారతి స్టేట్ బ్యూరో:** తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో ఉన్న తెదేపా అధినేత చంద్రబాబు ఆరోగ్యంపై విజయవాడ ఏసీబీ కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. చంద్రబాబు తరఫు న్యాయవాదులు ఆయన ఆరోగ్యంపై విజయవాడ ఏసీబీ కోర్టులో శనివారం సాయంత్రం హౌస్మోషన్ పిటిషన్ వేశారు. సిద్ధార్థలూథ్రా, గింజుపల్లి సుబ్బారావు ఆన్లైన్లోనే వాదనలు వినిపించారు. ప్రభుత్వ డాక్టర్ల సూచనలను జైలు అధికారులు పాటించేలా చూడాలని కోర్టును కోరారు. చంద్రబాబు తరఫు న్యాయవాదుల వాదనలు విన్న ఏసీబీ కోర్టు .. వైద్యుల సూచనలకు అనుగుణంగా చంద్రబాబు బ్యారక్లో చల్లదనం ఉండేలా టవర్ ఏసీ ఏర్పాటు చేయాలని ఆదేశించింది. జైలులో ఆయనకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని జైలు అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.

చంద్రబాబును పరీక్షించిన వైద్యులు.. ఆయన ఛాతీ, చేతులు, మెడ, గడ్డం, వీపు తదితర శరీర భాగాల్లో దద్దుర్లు, స్కిన్ అలర్జీ ఉన్నట్టు గుర్తించారు. ఈనెల 12న సాయంత్రం 4.30గంటలకు జీజీహెచ్ సూపరింటెండెంట్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు అదే రోజు సాయంత్రం 5 నుంచి 5.30గంటల వరకు పరీక్షించి.. జి.సూర్యనారాయణ, వి.సునీతదేవిలతో కూడిన వైద్యుల బృందం జైలు అధికారులకు నివేదిక అందజేసింది.

చంద్రబాబుకు చల్లని వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు, వివిధ రకాల మందులను వైద్యులు సిఫార్సు చేశారు. కానీ, జైలులో ఏసీ పెట్టేందుకు ప్రిజన్ రూల్స్ ఒప్పుకోవని జైళ్లశాఖ డీఐజీ రవికిరణ్ చెబుతూ వచ్చారు. ప్రత్యేక కేసుగా పరిగణించి కోర్టు ఆదేశిస్తే అప్పుడు పరిశీలిస్తామని చెప్పారు. దీంతో చంద్రబాబు తరఫు న్యాయవాదులు కోర్టును ఆశ్రయించడంతో.. టవర్ ఏసీ ఏర్పాటు చేయాలని న్యాయస్థానం ఆదేశించింది.

# తెలంగాణ ప్రజల కొంప ముంచింది చేపల పులుసే..

మొదటిపేజీ తరువాయి

లేఖ రాశారని, కానీ కేంద్రం నుంచి వచ్చిన రిప్లై గురించి మాత్రం ఎవరికీ చెప్పలేదన్నారు. ఈయన ఇలా చేస్తున్నాడని అపెక్స్ కౌన్సిల్ ఏర్పాటు చేస్తే గైర్హాజరయ్యాడని మండిపడ్డారు. కేసీఆర్ 292 టీఎంసీలకు సంతకం పెట్టిన దాన్ని దాన్ని సాక్షాలతో సహా బయటపెట్టామని బండి తెలిపారు. ఈ కేసు కోర్టులో ఉన్నందు వల్ల ట్రిబ్యునల్ ఏర్పాటు చేయలేకపోతున్నామని గజేంద్రసింగ్ షెకావత్ చెప్పారని, కేసు ఉపసంహరించుకుంటే చేసేందుకు ఆస్కారముందని చెప్పారన్నారు. అలా చెప్పాక కూడా కేసీఆర్ ఏడాది సమయం వృథా చేశారని బండి ధ్వజమెత్తారు. మొత్తానికి కేంద్రం ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తే సీఎం కనీసం సంతోషం కూడా వ్యక్తం చేయలేదన్నారు. రైతులు నష్టపోవడమే ఆయనకు కావాలని చురకలంటించారు. కేసీఆర్ నోటి నుంచి ముత్యాలు కాదని, మందు రాలుతుందన్నారు. ఒక్క మోటార్తో లక్ష ఎకరాలకు నీళ్లు ఎలా పారిస్తాడో సీఎం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. తెలంగాణలో పండిన ప్రతి గింజను కేంద్రం కొనడానికి సిద్ధంగా ఉందని, కేంద్రం రూ.2030 కి కొనడానికి సిద్ధంగా ఉన్నప్పుడు.. కేసీఆర్ రూ.1700కి కొంటామని ఎలా రేటు ఫిక్స్ చేశారని ధ్వజమెత్తారు. ఎవరికి లాభం చేయడానికి ఈ రేటు ఫిక్స్ చేశారని మండిపడ్డారు. దీని ద్వారా రూ.500 నుంచి రూ.700 కోట్లు చేతులు మారాయని ఆయన ఆరోపించారు. ఇవన్నీ.. ప్రగతి భవన్ కు చేరాయని పేర్కొన్నారు. రిటైర్డ్ అధికారులను తీసుకొచ్చి సీఎంవో కార్యాలయంలో పెట్టి ప్రజలను ఎలా దోచుకోవాలని భావించి వారిని నియమించుకున్నారన్నారు. అన్ని ముఖ్య శాఖల్లో ఇదే పరిస్థితి ఉందన్నారు. కేసీఆర్ బండారం మొత్తం బయటపెడుతామని బండి హెచ్చరించారు. రేపో.. ఎల్లుండో.. కేసీఆర్ బయటకు వస్తాడని, రైతు బంధు, ఫ్రీ యూరియా అంటూ మళ్లీ అన్ని అబద్ధాలు చెబుతారన్నారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ గెలిస్తే.. రైతు బంధు ఇవ్వడం పక్కనపెడితే.. ఉన్నది కూడా ఆపేయడం ఖాయమన్నారు. దుబ్బాక, హుజురాబాద్ ఎన్నికల్లో మోటార్లకు మీటర్లు పెడతారని అంటే.. అబద్ధాలు చెప్తే కేసీఆర్ కు మీటర్ పెడతామని హెచ్చరించామని ఆయన గుర్తుచేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్.. నంబర్ వన్ దొంగ, బట్టేబాజ్ అని విమర్శించారు. మోటార్లకు మీటర్లు అని అంటే ప్రగతి భవన్ కు వచ్చి గల్లా పట్టి కొడతామని అంటే.. నోరు మూసుకున్నారన్నారు. రైతులు తలుచుకుంటే.. బీఆర్ఎస్ ను గద్దె దింపవచ్చన్నారు. ధాన్యం కొనుగోలులో గోనె సంచి నుంచి కేసీఆర్ సర్కార్ చేసే బ్రోకర్ పర్సంటేజీ వరకు కేంద్రమే ఇస్తోందని బండి పేర్కొన్నారు. ఓటు వేసేందుకు వెళ్లే ముందు ప్రజలకు కేసీఆర్ తిన్న చేపల పులుసు గుర్తుకు రావాలని, పట పట పండ్లు కొరికి కమలం పువ్వు గుర్తుకు ఓటేయాలని బండి కోరారు. వచ్చే ఎన్నికల్లో 3+3=సిక్స్.. బీఆర్ఎస్ ఇంటికి పోవడం ఫిక్స్ అని బండి సంజయ్ అన్నారు. గత ఎన్నికల్లో కారు.. సారు.. పదహారు అన్నారని, అప్పుడు కారు షెడ్డుకు పోయిందని, సార్ ఫామ్ హౌజ్ కు వెళ్లారని, 16 ఎక్కడ పోయిందో వారికే తెలియాలని బండి ఎద్దేవాచేశారు. చిక్కడపల్లి లో ప్రవళిక అనే యువతి ఆత్మహత్య చేసుకోవడం దారుణమన్నారు. ప్రవళిక తన తల్లిదండ్రులకు ఫోన్ చేసి పరీక్షలన్నీ పోస్ట్ పోన్ అవుతున్నాయని, తనకోసం ఇప్పటి వరకు ఎంతో కష్టపడ్డారని వారితో ఫోన్ లో బాధపడిందన్నారు. ఆమె మృతికి నిరసనగా యువత మొత్తం వచ్చారని, వారితో పాటు ఎంపీ లక్ష్మణ్, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాష్ వాస్తవాలను తెలుసుకుందామని వెళ్లారన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వానికి అది నచ్చక పోలీసులతో యువకులపై లాఠీ చార్జీ చేయించారని, లక్ష్మణ్ ను ఎంపీ అని కూడా చూడకుండా ఈడ్చుకెళ్లారన్నారు.

# ఆమెది ఆత్మహత్య కాదు హత్యే

**- రాహుల్ గాంధీ**

**ఢిల్లీ, విశాల భారతి:** గ్రూప్2 అభ్యర్థి ప్రవళిక ఆత్మహత్యపై రాహుల్ గాంధీ స్పందించారు. ప్రవళిక ఆత్మహత్య బాధాకరమంటూ ట్వీట్ చేశారు. ప్రవళికది ఆత్మహత్య కాదని.. ప్రభుత్వ హత్యేనని ఆరోపించారు. తెలంగాణ నిరుద్యోగ సమస్యతో విలవిలలాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, బీజేపీ కలిసి తెలంగాణను సర్వనాశనం చేశాయని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే.. ఉద్యోగ క్యాలెండర్ను విడుదల చేస్తామని రాహుల్ ఈ సందర్భంగా నిరుద్యోగులకు హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడిన నెలరోజుల్లోనే టీఎస్పీఎస్సీని పునర్వ్యవస్థీకరిస్తామన్నారు. ఏడాదిలోపలే 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని తన ట్వీట్ లో రాహుల్ పేర్కొన్నారు.



తొర్రూరు లో బతుకమ్మ ఉత్సవాల లో పాల్గొని బతుకమ్మ ఆడుతున్న కాంగ్రెస్పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జి హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి



## బ్లాక్ మనీని వైట్ చేసుకునే
# పనిలో కేసీఆర్

మొదటిపేజీ తరువాయి

ఆయనకున్న ఏకైక లక్ష్యంగా పేర్కొన్నారు. కేసీఆర్ కు రాజకీయ పరమైన ఆలోచన తప్ప ప్రజల సంక్షేమంపై చిత్తశుద్ధి లేదని ధ్వజమెత్తారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అవ్వగానే.. ఫాం హౌజ్ ఇంజినీర్గా మారిపోయాడని విమర్శలు గుప్పించారు. అన్నీ ఆయనకే తెలిసినట్లు మాట్లాడుతున్నారని చురకలంటించారు. ఎందుకంటే ఆయన 80 వేల పుస్తకాలు చదివిన మేధావి కదా అని కిషన్ రెడ్డి ఎద్దేవాచేశారు. ఏది ఏమైనా కేటీఆర్ ను ముఖ్యమంత్రి చేయాలి.. తాను దేశ నేతగా ఎదగాలని కేసీఆర్ పగటి కలలు కంటున్నారని కిషన్ రెడ్డి విమర్శించారు. అవినీతి కుంభకోణాలు లేకుండా రాజకీయ వ్యవస్థను కాపాడుకోవాల్సిన అవసరం అందరిపై ఉందని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటు విద్యుత్ ప్రాజెక్టులకు కూడా కేంద్ర ప్రభుత్వం అప్పు ఇచ్చిందని, ఇప్పటి వరకు రూ.7 లక్షల కోట్ల అప్పు తెలంగాణకు కేంద్రం ఇచ్చిందని కిషన్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో పెండింగ్ లో ఉన్న 11 ప్రాజెక్టులను పూర్తి చేయాలని, అందుకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని మోడీ చెప్పారని గుర్తుచేశారు. ఏ నిర్ణయం తీసుకున్నా అది ఓట్ల కోసం కాదని, ప్రజలంతా తమకుఅండగా నిలవాలన్నారు. కేసీఆర్ ఫాంహౌజ్ లో కూర్చుని ఎకరాకు రూ.కోటి విలువైన పంట పండిస్తున్నానని చెప్పాడని, ఆ సీక్రెట్ ఏంటో చెబితే తెలంగాన రైతులు కూడా బాగు పడతారు కదా అని కిషన్ రెడ్డి చురకలంటించారు.

ఇదిలా ఉండగా బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో త్వరలో జరగబోయే ఎన్నికలకు కర్ణాటక నుంచి కాంగ్రెస్ డబ్బు తరలించేందుకు సిద్ధమైందని ఆరోపణలు చేశారు. బెంగుళూరులోని ఓ కాంగ్రెస్ నేత ఇంట్లో డబ్బులు దొరకడమే ఇందుకు సాక్ష్యమని ఆయన చెప్పారు. అధికారుల దర్యాప్తులో అవి తెలంగాణకు చేరవేసేందుకు ఏర్పాటు చేసినట్లు తెలిసిందని ఆయన వెల్లడించారు. చత్తీస్ గఢ్ లో ఆవు పేడ కుంభకోణం బయటపడిందని, కాంగ్రెస్ నేతలు ఆవుపేడను కూడా వదిలిపెట్టడం లేదని మండిపడ్డారు. రాహుల్ గాంధీ చేసిన యాత్ర ఇండియా లూటో యాత్రగా ఆయన చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ఇచ్చిన పథకాలు కర్ణాటకలో అమలు చేయలేకపోతున్నారని ఫైరయ్యారు. ఎన్నికలకు షెడ్యూల్ వచ్చిన తరువాత బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాత తేదీలు వేసి శంకుస్థాపనలు చేస్తున్నారని కిషన్ రెడ్డి ధ్వజమెత్తారు. నిధులు ఉన్నా, లేకున్నా శంకుస్థాపనలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలు.. కుల సంఘాలు, కాలనీ అసోసియేషన్ లీడర్లతో రాత్రుళ్ళు లిక్కర్ సమావేశాలు షురూ చేశారని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ హయాంలో లో అనేక కుంభకోణాలు జరిగాయని, కుంభకోణాలు చేసి దేశ ప్రజలను లూటీ చేసిన పార్టీ కాంగ్రెస్ అని కిషన్ రెడ్డి విరుచుకుపడ్డారు. బీఆర్ఎస్ ది కూడా అదే దారి అని మండిపడ్డారు. ప్రజలు బీఆర్ఎస్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇదిలా ఉండగా ఎలాంటి ఆధారాలతో ప్రవళిక ఆత్మహత్యను తప్పుదోవ పట్టిస్తున్నారో పోలీసులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పరీక్షలు ఆలస్యమవుతుండటంతో ప్రవళిక అమ్మాయి తల్లితండ్రులతో ఆవేదన వ్యక్తం చేసిన ఆధారాలున్నాయని ఆయన చెప్పారు. టీఎస్ పీఎస్సీ తప్పులను కప్పి పుచ్చడానికే ప్రభుత్వం ఇలా వ్యవహరిస్తోందని కిషన్ రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్ లో చేరుతున్న పొన్నాలకు ఒక్కటే చెబుతున్నానని, ఆయన పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్లుగా మారడం ఖాయమన్నారు.



# ఈ నెల 16న రాజ్ నాథ్ సింగ్ రాక

- మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్లో బహిరంగ సభ
- బీజేపీ నియోజకవర్గ ఇన్చార్జి అందెల శ్రీరాములు
- మహిళలు భారీ సంఖ్యలో తరలిరావాలని పిలుపు

**మహేశ్వరం, విశాల భారతి:** ఈ నెల 16న కేంద్ర రక్షణ శాఖా మంత్రి రాజ్ నాథ్ సింగ్ మహేశ్వరం నియోజకవర్గం రానున్నారు. బడంగ్ పేట కార్పొరేషన్ లోని సిరిపురం యాదయ్య గ్రౌండ్ (మున్సిపల్ క్రీడా ప్రాంగణం) లో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు బడంగ్ పేట కార్పొరేషన్ అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి. ఈ సందర్భంగా బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ సప్తగిరి కాలనీ సహా పలువురు మహిళలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇన్చార్జి అందెల శ్రీరాములు యాదవ్. సాయంత్రం 4 గంటలకు జరిగే రాజ్ నాథ్ సింగ్ గారి భారీ సభకు రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం నలుమూలల నుంచి కాషాయ శ్రేణులు తరలి వస్తారని శ్రీరాములు చెప్పారు. మహేశ్వరం గడికోటపై కాషాయం జెండా ఎగరేయటమే లక్ష్యంగా రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ గారి పర్యటన కొనసాగుతుందని అందెల శ్రీరాములు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ఏనుగు ప్రభాకర్ రెడ్డి, నడికుడి యాదగిరి, ప్రభాకర్, తర్రె మల్లేష్ యాదవ్, చిత్రం శ్రీను, రామకృష్ణారెడ్డి, రాంబాబు, లక్ష్మణ్, ఏల్చెల భాస్కర్ రెడ్డి, నర్సింహా, నివేదిత సహా కాలనీవాసులు, బడంగ్పేట్ బీజేపీ, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.



## చిన్నజీయర్ స్వామి ఆశీర్వాదం
# తీసుకున్న బుక్క వేణుగోపాల్


**రాజేంద్రనగర్, విశాల భారతి:** బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాజేంద్రనగర్ సీనియర్ బిజెపి నాయకులు బుక్క వేణుగోపాల్ శనివారం జన్మదినం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముచ్చింతల్ ఆశ్రమానికి చేరుకొని శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి మంగళ శాసనములు తీసుకున్నారు. ఆయనతో పాటు రాజేంద్రనగర్ నియోజకవర్గ బిజెపి పదాధికారులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్క బిజెపి కార్యకర్తను, అభిమానిని స్వామివారికి పరిచయం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో రాజేంద్రనగర్ నియోజకవర్గం నుండి బిజెపి తరఫున టికెట్ ఆశిస్తున్నట్లు తెలిపారు. స్వామి వారి ఆశీర్వాదంతో సీటు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



# ప్రేమ వ్యవహారంతోనే ప్రవళిక సూసైడ్

మొదటిపేజీ తరువాయి

లేదు. ఇప్పటివరకు ప్రవళిక ఎలాంటి పోటీ పరీక్షకు హాజరు కాలేదు. పూర్తిగా వ్యక్తిగతమైన అంశాలే ప్రవళిక ఆత్మహత్యకు కారణం. కాబట్టి.. ఎటువంటి అవాస్తవాలు ప్రచారం చేయొద్దని డీసీపీ వెంకటేశ్వర్లు కోరారు. వివరాల్లోకి వెళితే.. వరంగల్ జిల్లా బిక్కాజీపల్లికి చెందిన మర్రి ప్రవళిక.. హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్ అశోక్ నగర్లోని ఓ ప్రైవేట్ హాస్టల్లో ఉంటూ గ్రూప్2 పరీక్షకు సిద్ధం అవుతోంది. శుక్రవారం ఎవరూ లేని సమయంలో గదిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అయితే.. ఆమె గ్రూప్2 పరీక్ష వాయిదా కారణంగానే ఆమె తీవ్ర మనోవేదనకు గురైందని.. ఆ ఒత్తిడిలోనే ఆత్మహత్యకు పాల్పడిందని విద్యార్థి జేఏసీ ప్రతినిధులు, విపక్ష పార్టీల సభ్యులు, కొందరు ఉద్యోగాభ్యర్థులు ఆందోళనకు దిగారు. దీంతో శుక్రవారం అర్ధరాత్రి ఆర్టీసీ క్రాస్ రోడ్లో తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. మరోవైపు ప్రవళికది ఆత్మహత్య కాదని.. పరీక్షల వాయిదాతో ప్రభుత్వం చేసిన హత్య అంటూ కాంగ్రెస్, బీజేపీ నేతలు విమర్శలు చేశారు. ఇదిలా ఉండగానే.. గవర్నర్ తమిళసై సౌందరరాజన్ సైతం ప్రవళిక మృతిపై పోలీస్ శాఖను నివేదిక కోరారు. పోలీస్ బందోబస్తు మధ్య.. శనివారం మధ్యాహ్నం తర్వాత ప్రవళిక అంత్యక్రియలు పూర్తయ్యాయి. చివరకు.. ఆమె మృతికి ప్రేమ వ్యవహారమే కారణమని దర్యాప్తు ద్వారా పోలీసులు తేల్చారు.





# హైదరాబాద్ రేంజే వేరు..


## సింగిల్ బెడ్రూం ఇండ్లకు చెల్లుచీటి

## పెరుగుతున్న ధరలకు అనగుణంగా పెద్దింటి -నిర్మాణాలకే బిల్డర్లు మొగ్గు

## విలాశమైన, విలాసవంతమైన ఇండ్లకు పెరుగుతున్న ఆదరణ

**విశాలభారతి, హైదరాబాద్:**

ఓవైపు హైదరాబాద్ విశ్వనగరంగా దూసుకుపోతుంది. మరోవైపు మెరుగైన విద్యా, ఉద్యోగ అవకాశాల కోసం మహానగరానికి క్యూ కట్టేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతూనే ఉంది. ఈ క్రమంలో హైదరాబాద్ కేంద్రంగా రెసిడెన్షియల్ ప్రాజెక్టులకు దేశంలోని అన్ని మెట్రో నగరాల కంటే ఎక్కువ డిమాండ్ వస్తోంది. దీంతో గడిచిన కొంత కాలంగా నగర జీవన ప్రమాణాల్లో అనూహ్యమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. లగ్జరీ జీవితాన్ని అనుభవించేందుకు విశాలమైన ఇంటిని కోరుకుంటున్నారు. దీంతో హైదరాబాద్ కేంద్రంగా సింగిల్ బెడ్రూం ఇండ్లకు ఆదరణ తగ్గిపోతుండగా... బిల్డర్లు కూడా కొత్తగా చేపట్టే ప్రాజెక్టులలో రెండు, రెండున్నర, మూడు బెడ్రూం ఇండ్లను నిర్మించేందుకు ప్రాధాన్యతనిస్తున్నారు. అయితే ఇదీ సామాన్యుడి సొంతింటి కలలను దూరం చేస్తుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతుండగా... పెరుగుతున్న ధరలతో హైదరాబాద్ నగరంలో సొంతింటిని ఎప్పటికీ కొనుగోలు చేయలేదని చెబుతున్నారు. ఇటీవల హైదరాబాద్ కేంద్రంగా రియల్ ఎస్టేట్ మార్కెట్ స్థితిగతులపై వెల్లడైన పలు అధ్యయనాల ఫలితాలు డబుల్, త్రిపుల్, క్వాడ్రపుల్ బెడ్రూం ఇండ్లకు అత్యంత ఆదరణ పెరుగుతుందని స్పష్టం చేస్తున్నాయి. హైదరాబాద్ కేంద్రంగా లగ్జరీ రెసిడెన్షియల్ ప్రాజెక్టుల డిమాండ్ తారా స్థాయికి చేరుతున్నది. ఒకప్పుడు కనీసం 75 గజాల జాగా ఉన్నా చాలనుకునే పరిస్థితి నుంచి లగ్జరీ విల్లా స్థాయికి రేంజ్ పెరిగింది. ముఖ్యంగా మెట్రో కల్చర్ జీవనానికి అనుగుణంగా క్రమంగా అపార్టుమెంట్లు, హైరైజ్ ప్రాజెక్టులు, అపార్టుమెంట్ విల్లా ప్రాజెక్టులు, ఆల్ట్రా మోడ్రన్ విల్లా ప్రాజెక్టుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నట్లుగానే... సాధారణ ఇండ్ల నిర్మాణం కూడా క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. నగరం నలువైపులా రియల్





ఎస్టేట్ శరవేగంతో అభివృద్ధి చెందడంతో ఇటీవల దేశంలోనే ముంబై తర్వాత అత్యంత ఖరీదైన నగరంగాను నిలిచింది. వరల్డ్ క్లాస్ హైరైజ్ ప్రాజెక్టులను నిర్మించేందుకు దేశీయ స్థాయి నిర్మాణ కంపెనీలు, ప్రమోటర్లు మొగ్గు చూపుతున్నారు. దీంతో రియల్ ఎస్టేట్ మార్కెట్ రూపురేఖలే మారిపోతుండగా... దేశంలోనే అతి ఎత్తైన భవనాలను కలిగిన నగరాల జాబితాలోనూ రెండో స్థానంలో నిలిచిందంటే... సిటీ రియల్ ఎస్టేట్ మార్కెట్ రేంజ్ ఏ స్థాయికి చేరిందనే తెలిసిపోతుంది.

### మారుతున్న ట్రెండ్...

ఇటీవల కాలంలో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం అనూహ్య రీతిలో మార్పు చెందుతుంది. వేల కోట్లు రెసిడెన్షియల్, కమర్షియల్ ప్రాజెక్టులతోపాటు, ఇంటిగ్రేటెడ్ ఆల్ట్రా మోడ్రన్ టౌన్ షిప్‌లూ నగరం చుట్టూరా విస్తరిస్తున్నాయి. ఈ క్రమంలో విస్తరిస్తున్న నగరానికి అనుగుణంగా ఇక్కడ నివాస ప్రమాణాల్లోనూ మార్పులు వస్తున్నాయి. ఒకప్పుడు సింగిల్, డబుల్ బెడ్రూం ఇండ్లు అత్యధికంగా ఉండగా.. ప్రభుత్వం కొత్త ప్రాజెక్టులన్నీ డబుల్, 2.5, త్రిపుల్ బెడ్రూం ఇండ్ల నుంచి నిర్మాణం ప్రారంభం కావడం ఆసక్తి మారింది. మారుతున్న ట్రెండ్‌కు తగినట్లుగా వాటినే కొనేందుకు ఆసక్తి చూపుతుండగా... బిల్డర్లు కూడా విశాలమైన ఇండ్ల నిర్మాణాలకు ప్రాధాన్యతనిస్తున్నారు. దీంతో ఒకప్పుడు ఎక్కువగా ఉండే సింగిల్ బెడ్రూం ఇండ్లకు కాలం చెల్లనుంది.

### ఇండ్లు కొనేది వారే...

హైదరాబాద్‌లో ఇళ్ల క్రయ విక్రయాల్లో సాధారణ మధ్యతరగతి కంటే ఎగువ, అధిక, ఆదాయం కలిగిన వారు, వ్యాపారుల, లేదా ఉద్యోగ వర్గాలే ఎక్కువగా ఉన్నారని తేలింది. వీరు మాత్రమే విశాలమైన ఇండ్లకు కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీనికి తోడు కరోనా తర్వాత వర్క్ ఫ్రం హోం మోడ్రన్ వర్క్ కల్చర్ విస్తరించడంతో... ఖచ్చితంగా ఇంట్లోనే ఉద్యోగానికి అవసరమైన గదుల అవసరం ఏర్పడింది. ఆ విధంగా క్రమంగా ఇరుకైన సింగిల్ బెడ్రూం ఇండ్ల వినియోగం తగ్గిపోతుంటే డబుల్, 2.5 బెడ్రూం ఇళ్లకు డిమాండ్ పెరుగుతుంది. అయితే తాజాగా ఇంటిలో ఉండేవారి అవసరాలకు అనగుణంగా, పెరుగుతున్న పిల్లలు, హైబ్రీడ్ వర్క్ కల్చర్ విధానంలో క్రమంగా త్రిపుల్ బెడ్రూం, విల్లా ఫ్లాట్ల వైపు జనాలు ఆసక్తి ఆసక్తి చూపుతున్నారు. దీనికి తోడు గేటెడ్ కమ్యూనిటీలు, అపార్టుమెంట్లు, లగ్జరీ విల్లా కమ్యూనిటీల్లో ఉండే అదనపు సదుపాయాలు, సౌకర్యాల దృష్ట్యా విలాసవంతంగా ప్రశాంతమైన జీవనానికి కోరుకుంటూ పెద్దిండ్ల వైపు జనాలు ఉన్నత, ఎగువ మధ్యతరగతి జనాలు కూడా మారుతున్నారు.

### పెద్దిండ్ల నిర్మాణానికి బిల్డర్ల ప్రాధాన్యత...

హైదరాబాద్ కేంద్రంగా పెరిగిన రెసిడెన్షియల్ ప్రాజెక్టుల డిమాండ్ నేపథ్యంలో పెద్దిండ్లకు అత్యంత ఆదరణ వస్తోంది. ప్రీమియం కస్టమర్ల సంఖ్య గణనీయంగా పెరగడం, ఇక్కడ రియల్ ఎస్టేట్ మార్కెట్‌కు ఉన్న డిమాండ్‌తో వస్తున్న బడా కంపెనీలతో క్రమంగా పెద్దిండ్ల నిర్మాణం అనివార్యంగా మారింది. కొనుగోలుదారుల ఆర్థిక స్థోమత, అందుబాటులోకి వచ్చిన బ్యాంకింగ్ సదుపాయాలు కూడా విశాలమైన ఇండ్ల మార్కెట్‌ను క్రమంగా పెంచుతుందని నిపుణులు చెబుతున్నారు. దీంతో బిల్డర్లు కూడా ఆ తరహా ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రాధాన్యతనిస్తున్నట్లుగా వెల్లడైంది. ఇప్పటికే కొందరు బిల్డర్లు కొత్తగా చేపట్టే ప్రాజెక్టులలో 3 బీహెచ్‌కే ఇండ్లతోనే చేపడుతుంది... హైరైజ్ ప్రాజెక్టులలో కనీస ఫ్లాట్ సైజ్ 1500 చదరపు అడుగులకు పైనే ఉంటుంది. ఆ తరహా ఇండ్లలోనే క్రయవిక్రయాలు ఎక్కువగా ఉండటంతోనే బడా ప్రాజెక్టులను చేపడుతున్నట్లుగా బిల్డర్లు చెబుతున్నారు. ఇటీవల కాలంలో నాలుగు, ఐదు బెడ్రూం ఇండ్ల ప్రాజెక్టులతోపాటు మూడు వేల చదుపు అడుగుల నుంచి 15 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉండే ఆల్ట్రా మోడ్రన్ ప్రాజెక్టుల సంఖ్య గణనీయంగా పెరగడాన్ని బట్టి చూస్తుంటే సాధారణ మధ్యతరగతికి అనువైపు ప్రాజెక్టులకు కాలం చెల్లినట్టేనని చెబుతున్నారు. కోర్ సిటీలోనే కాకుండా శివారు ప్రాంతాలు, ఓఆర్ఆర్ వెంబడి కొత్తగా అందుబాటులోకి వస్తున్న ఇంటిగ్రేటెడ్ టౌన్ షిప్పలలోనూ ఇదే తరహా ట్రెండ్ మొదలుకావడం విశేషం.



### విశాలమైన ఇండ్లకు ప్రాధాన్యత...

మారుతున్న ఆర్థిక స్థితిగతుల నేపథ్యంలోనే జీవనంలోనూ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. సంపాదనకు తగినట్లుగా విశాలమైన, విలాసవంతమైన ఇండ్లకు ప్రాధాన్యతనిస్తున్నారు. దీంతో 650-1000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉండే డబుల్ బెడ్రూం ఇండ్ల కంటే... కనీసం 1300 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉండే డబుల్ బెడ్రూం ఇండ్లను కోరుకుంటున్నారు. మౌలిక వసతుల కోసం పుష్కళంగా ఉండే ఓపెన్ ప్లేస్, విశాలమైన కారిడార్లు, వెంటిలేషన్, పచ్చదనానికి అనువైన ప్రదేశంతోపాటు, పిల్లలు ఆడుకునేందుకు ప్రత్యేక ఆట స్థలం, క్లబ్ హౌజ్ వంటి ఆధునిక సౌలతులు ఉండే ప్రాజెక్టుల సంఖ్య గణనీయంగా పెరగడంతో... కొనుగోలుదారులు కూడా వాటికే మొగ్గుచూపుతున్నారు. దీంతో 1000 చదరపు అడుగుల విస్తీర్ణం లోపు ఉండే డబుల్ బెడ్రూం ఇండ్లు కూడా జనాలకు ఇరుగ్గానే కనిపించడంతో స్టాండ్ ఎలోన్ ప్రాజెక్టుల్లో చేపట్టే డబుల్ బెడ్రూం, స్టూడియో తరహా ఇండ్లను డిమాండ్ తగ్గుతుంది.

### చిన్న ఇండ్ల నిర్మాణం ఎందకు తగ్గుతుందంటే...

కొన్ని రంగాల్లో మినహా దాదాపు అన్ని రంగాల్లో మంచిజీతభత్యాలు, మోడ్రన్ జీవనశైలికి అనువైన ఆదాయం, అందుబాటులోకి వస్తున్న బ్యాంకింగ్ సేవలు, భూముల ధరలు గణనీయంగా పెరగడంతో ఇండిపెండెంట్ ఇళ్లు కట్టుకోలేకపోయినా... కనీసం విశాలమైన ఫ్లాట్లలోనైనా ఉండాలని చిన్న ఇండ్ల కంటే పెద్ద ఇండ్ల వైపు మొగ్గు చూపడానికి కారణాలు చెబుతున్నారు. అదేవిధంగా పెరుగుతున్న నిర్మాణ వ్యయం కూడా పెరగడం కూడా సింగిల్, 1000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉండే డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణం బిల్డర్లకు గిట్టుబాటు కాకపోవడమే... పెద్దగా ఉండే ఇండ్ల నిర్మాణానికి ప్రాధాన్యతనిస్తున్నారు. దీంతో చాలా వరకు బిల్డర్లే సింగిల్, సాధారణ డబుల్ బెడ్రూం ఇండ్ల కంటే... విశాలమైన డబుల్ బెడ్రూం ప్రాజెక్టులను చేపడుతున్నారు. ఇక నగరంలో విపరీతంగా పెరుగుతున్న జనాభాతో ఎన్నో సమస్యలు తలెత్తుతున్నాయి. అందులో ప్రధానంగా రవాణా, పార్కింగ్ సదుపాయం ఉండే గేటెడ్ కమ్యూనిటీ, విశాలమైన ఇండ్లకు ప్రాధాన్యత పెరగడానికి కారణాలు చెబుతున్నారు. స్టాండ్ ఎలోన్ ప్రాజెక్టులలో ఉండే డబుల్ బెడ్రూం ఇండ్లను కొనుగోలు చేస్తే ఒక్క కారుకు మాత్రమే పార్కింగ్ సదుపాయం ఉంటుంది. అదే 3బీహెచ్‌కే, గేటెడ్ కమ్యూనిటీ అపార్టుమెంట్లలో ఫ్లాట్ విస్తీర్ణాన్ని బట్టి రెండు కార్ల పార్కింగ్‌కు అవకాశం కల్పించడంతో విశాలమైన ఇండ్ల వైపు జనాలు మొగ్గుచూపుతున్నారని చెబుతున్నారని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.





# టీఎస్‌పీఎస్‌సీని రద్దు చేయాలి

- టీపీసీసీ మెంబర్ రాయల నాగేశ్వరరావు

**తిరుమలాయపాలెం, విశాల భారతి:** తిరుమలాయపాలెం మండల కేంద్రములో అఖిలపక్షం ఆధ్వర్యంలో నిర్వహించిన రాస్తారోకో కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ (టీఎస్ పి ఎస్ సి) బోర్డును రద్దు చేసి వెంటనే నూతన బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు ప్రభుత్వం నిరుద్యోగుల జీవితంతో చెలగాటం అడుతుందని ఆయన ఆరోపించారు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను పూర్తిగా ప్రక్షాళన చేయాలని ఆయన తెలిపారు ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ లో ప్రకటించిన విధంగా డిఎస్సీ పోస్టులను 13,500 కు పెంచాలన్నారు పరీక్షల రద్దుకు సంబంధించి పబ్లిక్ సర్వీస్ కమిషన్ బాధ్యత వహించి పరీక్షలు రాసిన నిరుద్యోగులకు మూడు లక్షల రూపాయల పరిహారం చెల్లించాలని రాయల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు



# పార్టీకి సేవ చేసిన వారిని హైకమాండ్ గుర్తిస్తుంది

- కాంగ్రెస్ పార్టీ నకిరేకల్ నియోజకవర్గ ఇన్‌చార్జి దైద రవీందర్

**రామన్నపేట, విశాల భారతి:** రామన్నపేట మండలం దుబ్బాక గ్రామ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమైన కాంగ్రెస్ పార్టీ నకిరేకల్ నియోజకవర్గ ఇంచార్జ్ దైద రవీందర్ నకిరేకల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీలో జరిగిన పరిణామాలపై ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కొత్త వారిని తీసుకొని వచ్చి పార్టీ టికెట్ ఇస్తామని చెప్తుండటం తో మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ జెండా మోసిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అభద్రతా భావానికి గురవుతున్నారు అని వాపోయారు. ప్రస్తుత ఎమ్మెల్యే పార్టీ మారినప్పటి నుండి పార్టీ కార్యక్రమాలు చేస్తూ నకిరేకల్ నియోజకవర్గంలో పార్టీని , కార్యకర్తలను కంటికి రెప్పలా చూసుకున్న అన్నారు. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సొంత నియోజకవర్గం కాబట్టి నకిరేకల్ లో ఎవరిని నిలబెట్టిన బంపర్ మెజార్టీతో గెలుస్తాం కదా మరి పార్టీకోసం కష్టబడ్డ వారిని కాదని కొత్త వారిని తీసుకొని రావడం లో ఆంతర్యం ఏమిటో తెలియక నియోజకవర్గ ప్రజలు మదనపడుతున్నారు పార్టీ అధిష్టానం పార్టీకి పనిచేసిన వారిని గుర్తించి వారికి అవకాశం ఇస్తే బంపర్ మెజార్టీ తో గెలుస్తాం అని మనం పార్టీకి చేసిన సేవలు పార్టీ అధిష్టానం గుర్తిస్తుంది అనే నమ్మకం ఉన్నది పాత కాంగ్రెస్ వాళ్లు ఓర్పుతో ఉండాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో చైర్మన్ గార్లపాటి రవీందర్ రెడ్డి దుబ్బాక మాజీ సర్పంచ్ గుండాల నర్సింహ గుండాల సతీష్ , మాజీ ఉపసర్పంచ్ గుండాల యాదయ్య మిర్యాల మల్లేష్ శెట్టి శేఖర్ , గట్టు రాములు , గుండాల వెంకన్న , పుట్టల స్వామి , ఎటెల్లి కృష్ణ , గట్టు నరేందర్ , కంభాలపల్లి శాంతి కుమార్ , గట్టు బాలు , గుండాల మోహన్ బాబు , గుండాల శివ , గట్టు శివకుమార్ , మామిడి నవీన్ , శివ , గ్యార వినయ్ , ఇంజమూరి శేఖర్ , తోట సాయి తదితరులు పాల్గొన్నారు

# ద్విచక్ర వాహనంపై నుండి పడి మహిళ మృతి



**ముస్తాబాద్, విశాల భారతి:** భర్తతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ప్రమాదవశాత్తు జారిపడి మహిళ మృతి చెందిన సంఘటన ముస్తాబాద్ పట్టణ శివారులో శనివారం ఉదయం చోటు చేసుకుంది. ఎస్ఐ శేఖర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం జక్కాపూర్ గ్రామానికి చెందిన కోల సులోచన(49) ముస్తాబాద్ మండలం గూడెం గ్రామంలో గల తన కూతురు ఇంటికి వచ్చింది. శనివారం ఉదయం తన భర్త రాజారాం తో కలిసి వారి స్వగ్రామం జక్కాపూర్ కు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ముస్తాబాద్ శివారు దాటిన తర్వాత వాహనం వెనుకాల కూర్చుని ఉన్న కోల సులోచన ప్రమాదవశాత్తు బైక్ పై నుండి క్రింద పడింది. తలకు తీవ్ర గాయాలవడంతో రక్తస్రావమై ఘటనా స్థలిలోనే మృతి చెందింది. మృతురాలి కూతురు పిడుగురాళ్ల రేఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ తెలిపారు.



# టీఎస్పీఎస్సీని రద్దు చేసి కొత్త బోర్డుని ఏర్పాటు చేయాలి

**మహబూబాబాద్/ తొర్రూర్, విశాల భారతి:** నిరుద్యోగ యువతీ ప్రవళికది ప్రభుత్వ హత్యనే అని ఆమ్ ఆద్మీ పార్టీ విద్యార్థి విభాగం సి.వై.ఎస్.ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సురేష్ బాబు, ఏఐఎఫ్డిఎస్ రాష్ట్ర నాయకులు గూగులోతు అరుణ్ లు స్థానిక తొర్రూర్ పట్టణంలోని గాంధీ సెంటర్లో నిరుద్యోగ యువతీ ప్రవల్లిక ఆత్మకు శాంతి చేకూర్చాలని, నిరుద్యోగ వ్యతిరేక ప్రభుత్వ విధానాలు నశించాలని గాంధీ సెంటర్లో నిరసన తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్రంలో నిరుద్యోగుల ఆత్మహత్యలకు కేసీఆర్ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి కారణమని విమర్శించారు. వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన ప్రవళిక గ్రూప్ టు టిఆర్టి పరీక్షలు వాయిదా వేయడం వల్లే ఆందోళనకు గురై బలవన్మరణానికి పాల్పడిందని అన్నారు. ప్రవళిక కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని, ఐదు కోట్ల నష్టపరిహారాన్ని వారి కుటుంబానికి ఇవ్వాలని వారి కుటుంబంలో ఒకరికి అర్హత కలిగిన వారికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల ఆత్మహత్యలకు కారణమైన టిఎస్పిఎస్సి బోర్డును తక్షణమే రద్దుచేసి నూతన బోర్డుని ఏర్పాటు చేయాలని, టీఎస్పీఎస్సీ చైర్మన్ జనార్ధన్ రెడ్డిని తక్షణమే తొలగించాలని అతనిపై క్రిమినల్ కేసులను నమోదు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు సి.వై.ఎస్.ఎస్ జిల్లా నాయకులు హరీష్, శివాజీ, నితిన్, ఉదయ్, కుమార్, రవి, సాయి,రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# పండుగ పూట విషాదం

- చెరువులో పడి ముగ్గురు సఫాయి కార్మికుల గల్లంతు
- సిద్దిపేట జిల్లా తిగుల్ గ్రామంలో విషాదం
- చెరువులో గాలిస్తున్న గజ ఈతగాళ్లు

విశాల భారతి, జగదేవపూర్ :



బతుకమ్మ పండుగ పూట గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. చెరువులో పడి ముగ్గురు సఫాయి కార్మికులు గల్లంతయ్యారు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం తీగుల్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం సఫాయి కార్మికులుగా పని చేస్తున్న గిరిపల్లి భారతి (45), ఎల్లం యాదమ్మ (42), కర్రెమొల్ల బాబు (26), మధు, నాగేష్, విజయతోపాటు కారోబార్ పనిచేస్తున్న లచ్చయ్య చెరువు వద్ద బతుకమ్మ పండుగను పురస్కరించుకొని మెట్లను శుభ్రం చేశారు. అనంతరం తిరిగి చెరువులో కాళ్లు చేతులు శుభ్రం చేసుకోవడానికి చెరువులోకి ఆరుగురు సఫాయి కార్మికులు దిగారు. ఈ క్రమంలో యాదమ్మ ప్రమాదవశాత్తు నీట మునగడంతో ఆమెను కాపాడడానికి గిరిపల్లి భారతి, బాబులు ప్రయత్నం చేయగా వారు కూడా నీట మునిగారు. వారితోపాటు విజయ నాగేశ్ కూడా నీట మునుగుతుండడంతో గట్టుమీద ఉన్న మధు చెరువులో దూకి విజయ నాగేశ్ను గట్టుకు తీసుకొచ్చారు. అప్పటికే మిగతా ముగ్గురు చెరువులో మునిగి గల్లంతయ్యారు. వెంటనే చెరువు కట్టపై ఉన్న మరో వ్యక్తి అయ్యాలం దిగి ప్రయత్నం చేసిన ఫలించలేదు. విషయం తెలుసుకున్న సర్పంచ్ భాను ప్రకాశ్రావు స్థానికులుగా చెరువు దగ్గర చేరుకున్నారు. అనంతరం రాంనగర్కు చెందిన గజ ఈతగాళ్లు చెరువులోకి దిగి మృతదేహాన్ని ఒక్కొక్కటి బయటికి తీశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని సంఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# ప్రభుత్వ తప్పిదాల వల్లనే నిరుద్యోగుల ఆత్మహత్యలు

- తెలంగాణ నిరుద్యోగ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు



**బెల్లంపల్లి, విశాల భారతి:** తెలంగాణ రాష్ట్రం వచ్చి పది సంవత్సరాలు కావస్తున్న రాష్ట్రంలో ఆత్మహత్యలు ఆగడం లేదని నిరుద్యోగుల జీవితాలతో కేసీఆర్ ప్రభుత్వం చెలగాటమాడుతుందని తెలంగాణ నిరుద్యోగ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. ఈ సందర్భంగా తాండూరు మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ నోటిఫికేషన్లు రాక వచ్చినా వాయిదాలు పడుతూ పేపర్ లీకేజీలతో కోర్టు కేసులతో నిరుద్యోగులు నిరాశ నిస్పృహలో కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు. రెండేళ్లుగా హైదరాబాదులోని అశోక్ నగర్ లో గర్ల్స్ హాస్టల్ లో ఉంటూ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగ యువతీ ప్రవళిక ఆత్మహత్యకు ప్రభుత్వమే కారణమని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు వాయిదా వేయడంతోనే సూసైడ్ చేసుకుందని అన్నారు. వరంగల్ నగరానికి చెందిన నిరుద్యోగ యువతీ ఉద్యోగం రాలేదని కుటుంబానికి భారమవుతున్నానని ఆత్మహత్య చేసుకుందని అన్నారు. ప్రవళిక మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని వారి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నీళ్లు నిధులు నియామకాల కోసం పోరాడి సాధించుకున్న ఈ తెలంగాణలో నియామకాలు పారదర్శకంగా జరగడంలేదని నిరుద్యోగులు చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రవళిక కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కుటుంబానికి అన్ని విధాల న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



# ఘనంగా బతుకమ్మ వేడుకలు

**ఆమనగల్లు, విశాల భారతి:** బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో... బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ బతుకమ్మ ఆడుతూ ఆమనగల్లు, కడ్తాల్ మహిళలు, యువతులు,బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఆమనగల్లు బతుకమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. చేతిలో బతుకమ్మలతో వయోభేదం లేకుండా బతుకమ్మ ఆటలకు మహిళలు, యువతులు వేడుకల్లో పాల్గొని బతుకమ్మ పాటలతో ప్రతిధ్వనిస్తూ ఆ ప్రాంగణమంతా పండగ వాతావరణం నెలకొంది. సాంప్రదాయ దుస్తులు ధరించి రంగుల పూలతో బతుకమ్మలను పేర్చి బతుకమ్మ ఆడారు.

# పండుగకు ఊరికి వెళ్ళేవారికి పోలీస్ లు సూచనలు



**ఆమనగల్లు, విశాల భారతి :** ఆమనగల్లు , కడ్తాల్, తలకొండపల్లి మండలాల ప్రజలకు దసరా పండగ సందర్భంగా ఆమనగల్లు, కడ్తాల్ సర్కిల్ పోలీసుల ఆధ్వర్యంలో ముఖ్య సూచనలు విడుదల చేశారు. ఊరు వెళ్లాల్సి వస్తే మీ విలువైన బంగారు , వెండి ఆభరణాలు, డబ్బులు , బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోవాలని, లేనిచో మీ ఇంట్లోనే రహస్య ప్రదేశంలో దాచుకోవలన్నారు. మీ ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టమ్ గల తాళము అమర్చుకునడం మంచిదన్నారు. తాళము వేసి ఊరికి వెళ్లవల్సి వస్తే మీ స్థానిక పోలీసు స్టేషన్ లో తప్పక సమాచారము ఇవ్వండని అన్నారు. మీ కాలనీలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసు స్టేషన్ కు సమాచారం ఇవ్వండి లేదా 100 నెంబర్ కు తప్పనిసరిగ ఫోన్ చేయండని తెలిపారు. మీ ద్విచక్ర వాహనాలకు తప్పనిసరిగా తాళాలు వేయండి, మీ వాహనాలను ఇంటి ఆవరణ లోనే పార్కు చేసుకొండని పేర్కొన్నారు. బతుకమ్మ సంబరాలు జరుపుకునేవారు నిమజ్జనం సమయంలో నీటి కుంటలు/చెరువులలో లోపలికి వెళ్ళకుండా తగిన జాగ్రత్తలు తీసుకొని నిమజ్జనం చేయాలి.రావణ దహనం సమయంలో ప్రజలు సంయమనం పాటించి మంటకు నిర్ధేశించిన దూరంలో ఉండాలి. అలాగే జమ్మి పూజ సమయంలో కూడా జాగ్రత్తగా వ్యవహరించి పండుగ సుఖ సంతోషాలతో జరుపుకోగలరు అని తెలిపారు.

# ఉప్పలయ్య మృతి బీజేపీకి తీరని లోటు



**దేవరుప్పుల, విశా భారతి:** దేవరుప్పుల మండలం, సింగరాజుపల్లి గ్రామ వాస్తవ్యులు బిజెపి ఎస్సీ మోర్చ మండల అధ్యక్షుడు పాలడుగు ఉప్పలయ్య ఈ నెల 01న సాయంత్రం రోడ్డు ప్రమాదంలో మరణించగా ఈ రోజు వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి వారికి ఎల్లవేళలా అండగా ఉంటామని,ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ తమ వంతు రూ.10వేలు ఆర్థిక సహాయం చేసిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగ రామ్మోహన్ రెడ్డి ఈ కార్యక్రమంలో దేవరుప్పుల మండల అధ్యక్షుడు భాగాల నవీన్ రెడ్డి,గడ్డం శోభన్ బాబు,పాలడుగు రమేష్,పాలడుగు మణమ్మ, తదితరులు పాల్గొన్నారు



# ఆమనగల్లు పోలీస్ కవాత్

**ఆమనగల్లు, విశాల భారతి:** ఆమనగల్లు పట్టణంలో పోలీస్ బలగాలతో పోలీసు కవాతు నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికలు సందర్భంగా శాంతి భద్రతల విషయంలో ప్రజలకు భరోసా కల్పించడానికి పోలీసులతో కవాతు నిర్వహించినట్లు సిఐ వెంకటేశ్వర్లు తెలిపారు. శాంతి భద్రతలను కాపాడడానికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బలరాం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




# మంత్రి వేములను పరామర్శించిన పలువురు ఎమ్మెల్యేలు

**బాల్కొండ, విశాల భారతి:** రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తల్లి మంజులమ్మ ఇటీవలే మృతి చెందారు. శనివారం నిజామాబాద్ జిల్లా వేల్పూర్ లోని వేముల ప్రశాంత్ రెడ్డి నివాసంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్, ముదోల్ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, టూరిజం ఎం.డి మనోహర్, వరంగల్ ఎలెక్ట్రిసిటి డైరెక్టర్ మోహన్ రెడ్డి తదితరులు పరామర్శించారు. ఈ సందర్భంగా మంజులమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని వారు ప్రార్థించారు. మంత్రి, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంత్రి వేముల తండ్రి దివంగత రైతు నాయకుడు వేముల సురేందర్ రెడ్డితో తమకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా వారు గుర్తు చేసుకున్నారు.

# సెలవు దినాల్లో తరగతులు నిర్వహించొద్దు

- పిడిఎస్యూ మండల కన్వీనర్ నరసింహ



**బాల్కొండ, విశాల భారతి:** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సెలవు దినాల్లో తరగతులు నిర్వహించద్దని పిడిఎస్యూ భీమ్‌గల్ మండల కన్వీనర్ నరసింహ తెలిపారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థలకు దసరా సెలవులు ప్రకటించిందని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మండలంలోని ప్రైవేట్ పాఠశాలలు తరగతులు నిర్వహిస్తే పాఠశాలల గుర్తింపు రద్దు చేపిస్తామని అన్నారు. ఈపాటికే అన్ని పాఠశాలల మేనేజ్మెంట్ లకు జిల్లా విద్యాధికారి సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తే తదుపరి చర్యలకు మేనేజ్మెంట్ బాధ్యతలు వహించాల్సి ఉంటుందని ఆదేశాలు జారీ చేశారని గుర్తు చేశారు. కాబట్టి మండలంలోని ఏ ఒక్క పాఠశాల కూడా సెలవు దినాల్లో తరగతులు నిర్వహించి విద్యార్థులను మానసికంగా గురి చేయద్దని కోరారు. ఒక వేల ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తే 8331889760 నెంబర్ కు కాల్ చేసి చెప్పాలన్నారు.

# జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

- నలుగురి మృతి

**నిజామాబాద్, విశాల భారతి:** నిజామాబాద్ జిల్లాలో 44 వ జాతీయ రహదారి శుక్రవారం అర్ధ రాత్రి నెత్తురోడింది. యూపీ వాసులను మృత్యువు వెంటాడి బలితీసుకుంది. ఈ సంఘటన శనివారం ఆలస్యంగా వెలుగు చూసింది. శుక్రవారం రాత్రి ఇందల్వాయి మండలం చంద్రయన్ పల్లి శివారు ప్రాంతంలో జాతీయ రహదారిపై ఒక వరి కోత మిషన్ బ్రేక్ డౌన్ అయింది. రహదారిపై హార్వెస్టర్ బ్రేక్ డౌన్ కావడంతో రోడ్డుపై ట్రాఫిక్ జాం ఏర్పడింది. ఆ సమయంలో హైదరాబాద్ నుంచి ఉత్తరప్రదేశ్ వెళుతున్న బస్సును లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ప్రయాణికులకు గాయాలు కాలేదు. దాంతో బస్సులో ఉన్న ప్రయాణికులు రోడ్డుపైన దిగగా వెనుక నుంచి వచ్చిన డీసీఎం లారీ ప్రయాణికులపై నుంచి దూసుకుపోయింది. ఈ ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే చనిపోయారు. మరో ఇద్దరిని అంబులెన్స్ లో జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఇందల్వాయి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. హైదరాబాద్ చుట్టు పక్కల ప్రాంతాల్లో కూలి పనులు చేసిన ఉత్తరప్రదేశ్ వాసులు దసరా పండగ కోసం సొంతూరుకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్టు బాధితులు తెలిపారు. మృతులను ప్రదీప్, జిత్తు, దుర్గేష్, గణేష్ గా గుర్తించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని బలరాం పూర్ జిల్లాకు చెందిన గణేష్ (22), దుర్గేష్ (16), సిద్ధార్థ నగర్ కు చెందిన జిత్తు (32), గోరఖ్ పూర్ జిల్లాకు చెందిన ప్రదీప్ (21) లు అని తెలిసింది. జాతీయ రహదారిపై వలస కూలీలను డీసీఎం డ్రైవర్ అతివేగంగా నిర్లక్ష్యంతో నడిపి పొట్టన పెట్టుకున్నాడు.



# బీఆర్ఎస్ లో చేరిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

**దేవరుప్పుల, విశాల భారతి:** పర్వతగిరిలోని ఎర్రబెల్లి దయాకర్ రావు నివాసంలో దేవరుప్పుల మండలం,చిన్నమడూరు గ్రామానికి చెందిన పలువురు యువకులు బిఆర్ఎస్ పార్టీ జిల్లా యువజన నాయకుడు వంగ అర్జున్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీని వీడి బిఆర్ఎస్ పార్టీలో చేరారు.మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు బిఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు.రానున్నది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని కొత్త పాత తేడా లేకుండా ప్రతి ఒక్కరు కలిసికట్టుగా పని చేసి పార్టీ గెలుపునకు లక్ష్యంగా కృషి చేయాలని వారికి మంత్రి పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారిలో కంకటి శ్రీను, సమ్మిరాజు, సమ్మి చంద్రశేఖర్, రాజు, రమేష్, సురేష్, స్వామి, అంజన్ కుమార్, ఆంజనేయులు, దిలీప్, సాయి, మల్లేశ్, ఉదయ్, హరీశ్, తదితరులు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తీగల దయాకర్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి చింత రవి, మండల యూత్ అధ్యక్షుడు బానోత్ నవీన్ నాయక్, తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా బతుకమ్మ సంబరాలు



**తొర్రూరు , విశాల భారతి:** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ. ఆడపడుచులందరూ సంబరంగా జరుపుకునే వేడుక బతుకమ్మ. ప్రకృతిని ఆరాధిస్తూ, అనుబంధాలను గుర్తు చేస్తూ సాగే పూల ఉత్సవం బతుకమ్మ. తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని చాటి చెప్పే కమనీయ దృశ్యం బతుకమ్మ. తెలంగాణాకే ప్రత్యేకమై, విశ్వ వ్యాప్తంగా గుర్తింపు పొందిన బతుకమ్మ వేడుకలు నేటి నుండి ప్రారంభం అయ్యాయి. బతుకమ్మ వేడుకలను తొమ్మిది రోజుల పాటు తెలంగాణ వ్యాప్తంగా అత్యంత ఘనంగా జరుపుకుంటారు. బతుకమ్మ సంబరాలు పితృ అమావాస్యనాడు ప్రారంభమై తొమ్మిది రోజులపాటు సాగుతాయి. ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమై ఈ సంబరాలు సద్దుల బతుకమ్మతో ముగుస్తాయి. ఈ తొమ్మిది రోజులపాటు మహిళలు ప్రకృతిలో దొరికే రకరకాల పూలతో బతుకమ్మలను పేర్చి, ఆడి పాడి, అత్యంత భక్తిశ్రద్ధలతో గౌరీదేవిని పూజించి, అందరూ సుఖశాంతులతో సుభిక్షంగా ఉండాలని కోరుకుంటారు. ఆశ్వయుజ అమావాస్య అయిన పితృ అమావాస్య నాడు ఎంగిలిపూల బతుకమ్మతో బతుకమ్మ పండుగ తొలి రోజు ఎంగిలిపూల బతుకమ్మ నాడు మహిళలు చక్కగా ముస్తాబై, గునుగు, తంగేడు,బంతి పూలు,చామంతి పూలు,కట్ల, మొల్ల, సీత జడలు, రుద్రాక్ష, మందార, పారిజాతం, కమలం, తామర, గన్నేరు వంటి రకరకాల పూలతో బతుకమ్మలను పేర్చి తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా పాటలు పాడుతూ ఎంగిలిపూల బతుకమ్మతో బతుకమ్మకు స్వాగతం పలుకుతారు. తెలంగాణ గ్రామీణ జీవన విధానాన్ని ప్రతిబింబించేలా ఉండే జానపద గీతాలతో బతుకమ్మ పండుగను జరుపుకోవడం విశేషం. ఎంగిలిపూల బతుకమ్మగా మొదటి రోజు ఉదయం తెలంగాణ రాష్ట్రంలోని మహిళలందరూ అత్యంత భక్తి శ్రద్ధలతో బతుకమ్మలను పేర్చి పూజిస్తారు. తొలిరోజు అమ్మవారికి నైవేద్యంగా నువ్వులు,పెసరా పప్పు, చెక్కర కలిపి ప్రసాదం తయారు చేస్తారు. ఇంట్లో ముందుగా బతుకమ్మను పూజిస్తారు. సాయంత్రం తొర్రూర్ పెద్ద చెరువు సమీపంలో, చెరువుల వద్ద మహిళలంతా గుమికూడి సమిష్టిగా బతుకమ్మ వేడుకలు జరుపుకుంటారు. బతుకమ్మ తయారీ కోసం ఒక రోజు ముందే పూలను సేకరించి అలా నిద్ర చేసిన పూలతో బతుకమ్మను పేర్చడం వల్ల ఎంగిలిపూల బతుకమ్మ అని పిలుస్తారని పెద్దలు చెబుతారు. కొన్ని ప్రాంతాలలో తిన్న తర్వాత బతుకమ్మను పేరుస్తారు. కాబట్టి ఎంగిలి పూల బతుకమ్మ అని పేరు వచ్చినట్టుగా చెప్తారు. ఏది ఏమైనా బతుకమ్మ ఓ కమనీయ పూల సంబరం.. తెలంగాణాకే తలమానికమైన వైభవం.



## మేము సైతం నల్ల కోసం అప్పన్నపేట (మారుతీనగర్) గ్రామ ప్రజలు

**పెద్దపల్లి, విశాల భారతి :** పెద్దపల్లి నియోజకవర్గం పెద్దపల్లి మండలం అప్పన్నపేట (మారుతీనగర్) గ్రామ ప్రజలు ఇటీవల BRS పార్టీ టికెట్ వ్యవహారంలో అసంతృప్తిగా ఉన్న నల్ల మనోహర్ రెడ్డిని గ్రామానికి స్వచ్ఛందంగా మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. రాబోయే ఎన్నికల్లో నల్ల మనోహర్ రెడ్డి బరిలో ఉండాలని తను ఏ పార్టీ నుండి పోటీ చేసిన తామంత నల్ల వెంటే ఉండి భారీ మెజారిటీతో గెలిపించుకుంటామంటూ హామీ ఇచ్చారు. ఈ సందర్బంగా నల్ల మనోహర్ రెడ్డి మాట్లాడుతూ.. అప్పన్నపేట (మారుతీనగర్) గ్రామ ప్రజలలో ఉన్న చైతన్యానికి తను సర్వదా రుణపడి ఉంటానని తప్పకుండా రాబోయే రోజుల్లో మీ అందరి సహాయ సహకారలతో ఎన్నికల బరిలో ఉంటానని, మీకు ఎలాంటి కష్టం వచ్చిన ఆపద వచ్చిన చేదోడు వాదోడుగా ఉంటానని, రాబోయే రోజుల్లో ప్రజలు మంచికి ఓటు వేయాలని మీరు నాకు ఇచ్చే స్ఫూర్తి, భరోసా వృధా కాకుండా ఒక మంచి వ్యవహార శైలి తో 24 గంటలు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ముందుకు పోతానని అన్నారు. ఈ సందర్బంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ 24 గంటలు నిత్యం ప్రజల లో ఉంటూ ప్రజా సేవ చేస్తూ ఆపద సమయంలో అన్ని విధాలుగా ఆదుకుంటున్న నల్ల మనోహర్ రెడ్డి మా సంపూర్ణ మద్దతు తెలుపుతూ మేమంతా తన వెంటే ఉండి తనని అత్యధిక మెజారిటీ తో గెలిపించుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మహిళలు, యువకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు



## బిఆర్ఎస్ తోనే అభివృద్ధి సాధ్యం

- గడపగడపకు ప్రచారంలో ఎమ్మెల్యే దాసరి

**సుల్తానాబాద్, విశాల భారతి:** నిరుపేదలకు భారత రాష్ట్ర సమితి అండగా ఉంటుందని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి తెలియజేశారు. శనివారం సుల్తానాబాద్ మండలం మంచిరామిలో గడపగడపకు ప్రచారంలో పాల్గొని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రపంచంలో ఎక్కడ లేని పథకాలను సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అమలు చేసి పేదల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. తెలంగాణలో అమలవుతున్న రైతుబంధు, రైతు బీమా, దళిత బంధు, బీసీ బందు, మైనార్టీ బందు, కెసిఆర్ కిట్టు, షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అల్పాహారం లాంటి పథకాలు ఇతర రాష్ట్రాల్లో ఉన్నాయా ప్రజలు తెలుసుకోవాలన్నారు. అధికారం కోసం దొంగ హామీలు ఇస్తున్న కాంగ్రెస్ పార్టీని నమ్మద్దని, నమ్మి మొండి చేయికి ఓటు వేస్తే తిరిగి కష్టాలు మొదలవుతాయన్నారు. ప్రచారంలో ఎమ్మెల్యే వెంట రైతు సమితి జిల్లా కోఆర్డినేటర్ పాల రామారావు, ఎంపీపీ పొన్నమనేని బాలాజీ రావు,మండల పార్టీ అధ్యక్షుడు పురం ప్రేమ్ చందర్ రావు, రైతు సమితి మండల కో ఆర్డినేటర్ బోయిని రాజమల్లయ్య, వైస్ ఎంపీపీ కోట స్వప్నరాంరెడ్డి, PACS ఛైర్మెన్ జూపల్లి సందీప్ రావు,సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు సుజాతరమేష్, మాజీ సర్పంచ్ పడాల అజయ్,కన్వీనర్ లు మైలారం నారాయణ, దీకొండ భూమేష్, రవి,సర్పంచ్ రాయమల్లు, ఉప సర్పంచ్ గణేష్, గ్రామ శాఖ అధ్యక్షుడు పూరేళ్ల శ్రీనివాస్, రైతు గ్రామ కోఆర్డినేటర్ ఏగుర్ల శ్రీనివాస్, ఏగుర్ల గట్టయ్య,ఏగుర్ల భాను ప్రకాష్, చల్ల రామన్న, రవి, పూరేళ్ల నరేష్, లక్ష్మణ్, శ్రీధర్ మండల సర్పంచ్ లు, ఎంపీటీసీలు, భారత రాష్ట్ర సమితి ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నరు.



## అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీనే

- మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం
- నకిరేకల్ లో ఎగిరేది కాంగ్రెస్ జెండానే
- ముఖ్య కార్యకర్తల సమావేశంలో వేముల

**నకిరేకల్, విశాలభారతి:** రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీ నే అని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. చిట్యాల మండలం వెలిమినేడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వెలిమినేడు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం జరిగింది. అనంతరం మాజీ ఎమ్మెల్యే వీరేశం మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన నాటి నుండి తెలంగాణ ఇచ్చిన పార్టీ గా అధికారంలో లేనప్పుటికి కార్యకర్తలు ఓపిక సహనం తో పార్టీ అభివృద్ధికే కృషి చేశారని కొనియాడారు. అందరూ కలిసి గెలిపించిన ఎమ్మెల్యే పార్టీ మారి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల పైనే అక్రమ కేసులు పెట్టారని అన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్క కార్యకర్త పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ప్రతి ఒక్క కార్యకర్తకు నాయకులకు అందరికీ అండగా ఉంటానని వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. ఈ సందర్బంగా పలువురు నాయకులు మాట్లాడుతూ మీరు కాంగ్రెస్ పార్టీలోకి రావడం మాకు ఎంతో సంతోషంగా ఉందని మాకు బలమైన లీడర్ దొరకడం కాంగ్రెస్ పార్టీకి ఎంతో శుభసూచకమన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలుపుకై మేము అహర్నిశలు కృషి చేస్తామని హామి ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గుడిపాటి లక్ష్మీనరసింహ, జిల్లా నాయకులు కందిమల్ల శిశుపాల్ రెడ్డి, పిఎసిఎస్ వైస్ చైర్మన్ బొంతల అంజిరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాటం వెంకటేశం, శాఖ అధ్యక్షులు సుర్కటి సత్తిరెడ్డి, సర్పంచ్ దేశబోయిన మల్లమ్మ, కాటం సత్తయ్య, అంతటి పారిజాత నరసింహ గౌడ్, చీమల వీరేశం కొంపెల్లి వెంకటరెడ్డి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఓటమి భయంతోనే బీఆర్ఎస్ అక్రమ కేసులు

**దేవరుప్పుల, విశాలభారతి :** దేవరుప్పుల మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులపై అక్రమ కేసులు పెడుతున్నందుకు నిరసనగా దేవరుప్పుల మండలకేంద్రంలోని జనగామసూర్యాపేట ప్రధానచౌరస్తాలో ముఖ్య అతిథులుగా టిపిసిసి సభ్యుడు డాక్టర్.లకావత్ లక్ష్మి నారాయణ నాయక్,పాలకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ,సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి,బీఎస్పీ పాలకుర్తి నియోజక వర్గ ఇంచార్జీ రాపాక శ్రీశైలం లు పాల్గొనగా ధర్నా, రాస్తారోకో నిర్వహించిన అఖిల పక్ష నాయకులు. అనంతరం అక్కడి నుండి స్థానిక పోలీస్ స్టేషన్ కు పాదయాత్రగా వెళ్లి ఓయూ జెఏసి నాయకుడు ఇప్ప పృథ్వీ పై పెట్టిన అక్రమ కేసుకు సంభందించిన వివరాలను దేవరుప్పుల మండల ఎస్సై శ్రావణ్ కుమార్ ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్బంగా వారు మీడియాతో మాట్లాడుతూ స్థానిక మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కక్ష సాదింపు చర్యలు,రాజకీయ ప్రతిపక్ష నాయకులను వేదించే చర్యలు మానుకోవాలని.. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత బిఆర్ఎస్ నాయకులు టిఫిన్ బ్యాగులు పంచుతున్నారని.. ప్రజలకు నచ్చజెప్పే విధంగా పృథ్వీ అక్కడికి వెళ్లి నందుకు అతనిపై అక్రమ కేసులు పెట్టారని.. అమాయక గిరిజనుల ఓట్లు దండుకోవాలని చూస్తున్న మంత్రి దయాకర్ రావు చిల్లర రాజకీయాలు మానుకోవాలని.. పాలకుర్తి నియోజక వర్గ బిఆర్ఎస్ నాయకులు ప్రతిపక్ష నాయకుల మీద అక్రమ కేసులు పెట్టీ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని.. అంతే కాకుండా పోలీస్ యంత్రాంగాన్ని కూడా తమ సొంత కార్యకర్తల్లాగా మలుచుకుంటున్నారని.. ప్రజా స్వామ్యం బ్రతకాలంటే బిఆర్ఎస్ ను ఓడించాలని.. పది సంవత్సరాల నుంచి అధికారంలో ఉన్న మంత్రి దయాకర్ రావు మీరు చేసిన అభివృద్ధిని ప్రజలకు తెలిపి ఓట్లు అడగాలని.. అంతే గానీ బ్యాగులు ఇచ్చుకుంటూ పేద ప్రజలు,అమాయక గిరిజనులను ఇరికించడమే కాకుండా వారి గౌరవాలను రోడ్డుకీడుస్తున్నారని.. పాలకుర్తి నియోజక వర్గంలో 61 వేల గిరిజనుల జీవితాలతో ఆడుకావాలని చూస్తే నీ జీవితంలో ఇదే చివరి రాజకీయ మజిలీ అవుతుందని.. అంతే కాకుండా ఇక్కడి పోలీసులు ప్రభుత్వఆయంలో పనిచేయాట్లేదని.. ఎలక్షన్ ఆయంలో పని చేస్తున్నారని.. మంత్రి దయాకర్ రావు నిన్న చేసిన ఒక గిరిజన మహిళ పరువు తీసినందుకు తక్షణమే క్షమాపణ చెప్పాలని వారు హెచ్చరించారు.

## గ్యారంటీ హామీలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరికలు

- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన నాయకులు

**నేరేడుచర్ల, విశాల భారతి :** 6 గ్యారంటీ హామీలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరికలు మొదలయ్యాయిని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొణతం చిన్న వెంకటరెడ్డి,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూకల సందీప్ రెడ్డి అన్నారు.శనివారం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని చింతబండ కాలనీ నుండి ఐదుగురు యువకులు కాంగ్రెస్ కండువా కప్పుకొని పార్టీలో చేరిన వారిని సాదరంగా ఆహ్వానించారు.పార్టీలో చేరిన వారు కృష్ణ,భారీ,వేణు ఎస్కే బబ్లు,దాసరి సందీప్,చందు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు బచ్చలకూరి ప్రకాష్,రణపంగ నాగయ్య,కొణతం రాంరెడ్డి బ్లాక్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ జంగిలి వెంకటేశ్వర్లు,బ్లాక్ వర్కింగ్ ప్రెసిడెంట్ రమావత్ పాండు నాయక్,రామకృష్ణ మెండే జాను,బూతు ఇంచార్జ్ కొప్పుల శ్రీను,మహిళా నాయకురాలు పున్నమ్మ,మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.





## ప్రవళిక ఆత్మహత్య ముమ్మాటికి ప్రభుత్వహత్యే

- మృతురాలి కుటుంబానికి న్యాయం చేసి ఆదుకోవాలి

**మహబూబాబాద్, విశాల భారతి:** గ్రూపు 2 పరీక్ష వాయిదా పడిందని మనస్థాపానికి గురై హైదరాబాద్ అశోక్ నగర్ లో ప్రైవేట్ హస్టల్ లో ఆత్మహత్య చేసుకోని చనిపోయిన నిరుద్యోగ విద్యార్థినీ ప్రవళిక ఆత్మహత్య ముమ్మాటికి ప్రభుత్వ హత్యేనని నిరుద్యోగులు విద్యార్థి సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘ నాయకులు సోమన్న, కేలోత్ సాయికుమార్, నిరుద్యోగులు ప్రవీణ్, శశి మాట్లాడుతూ.. రాష్ట్రంలో గత సంవత్సరం కాలంలో ఇది 8వ నిరుద్యోగుల ఆత్మహత్య సరైన ప్రణాళిక లేకుండా రాష్ట్రంలో టీఎస్పీఎస్సీ వ్యవరిస్తుంది. పరీక్ష నిర్వహణలో లోపభూయిష్టంగా ఉంది, దానికి తోడు పారదర్శకంగా నిర్వహించకపోవడం లాంటివి జరిగుతుంటే మళ్ళీ సమయాన్ని పోడిగించడం అంటే ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. కోచింగ్ సెంటర్లకు లక్షల రూపాయలు చెల్లించి, హస్టల్స్ లో వేలాది రుపాయాలు ఖర్చు చేస్తూ నిరుద్యోగులు చదువుకుంటున్నారు, వారీ ఇబ్బందులు ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు, అధికారం కోసం ఇస్తున్న ప్రాధాన్యత కనీసం విద్యార్థి, నిరుద్యోగులకు భరోసా కల్పించడం లేదు, పోన్నాల ఇంటికెళ్లిన కెటిఆర్ ,విద్యార్థి మరణిస్తే కనీసం వారి కుటుంబానికి భరోసా ఇచ్చే సమయం లేదా అని ప్రశ్నించారు. మృతురాలి కుటుంబానికి న్యాయం చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల పై పెట్టిన కేసులను ఎత్తివేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగులు యువత రాకేష్ వనిత, డివి నాయక్ , విద్యార్థి సంఘ నాయకులు మంద శశి కుమార్, సూర్య ప్రకాష్, సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు.



## పల్లె పల్లెనా బతుకమ్మ

**నూతనకల్, విశాల భారతి:** తెలంగాణ ఆడపడుచులు ఎంతో ఆనందంగా అపురూపంగా ప్రకృతిని ఆరాధిస్తూ ప్రకృతిలో దొరికే వివిధ రకాల పూలను తీసుకువచ్చి పూలనే దేవునిగా పూజించి గొప్ప పండుగ బతుకమ్మ. ఎంగిలిపూల బతుకమ్మ తో మొదలై సద్దుల బతుకమ్మతో ముగుస్తు ప్రకృతిని ఆరాధిస్తూ ఆడపడుచులు అత్తగారింటి ఆప్యాయతను కష్టదుక్క సుఖ సంతోషాలను తో పాటు అమ్మానాన్నల యొక్క ఆప్యాయతలను పల్లె యొక్క అందాలను అపురూపమైన పల్లె జానపద గేయాలతో పాడుతూ జరిగే పండుగ బతుకమ్మ .అలాంటి బతుకమ్మను మండల మండల పరిధిలోని అన్ని గ్రామాలలో ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ జరుపుకున్నారు. వివిధ రకాల పాటలు పాడుతూ పాటకు తగ్గట్టుగా నిత్యం చేస్తూ నాటి పరిస్థితులను వివరిస్తూ పల్లె దేవతలను కొనియాడుతూ ఆడపడుచులు వారి యొక్క సుఖసంతోషాలను పాటగా మలిచి ఉయ్యాల... ఉయ్యాల... అంటూ పాడుతూ ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ పండుగ నిర్వహించారు.

## ఎన్నికల కోడ్‌ను అన్ని పార్టీలు పాటించాలి

- సీనియర్ జర్నలిస్ట్ గాయం శ్రీనివాస్ రెడ్డి



**మునగాల, విశాల భారతి:** తెలంగాణ రాష్ట్రంలో అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్ ప్రకారం ఎన్నికల ప్రవర్తన నియమావళిని వివిధ రాజకీయ పార్టీలు తూచా తప్పకుండా పాటించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళికి లోబడి ఎన్నికల సిబ్బంది పని చేయాలని, ఎటువంటి ప్రలోభాలకు ఎవరు లొంగవద్దని సీనియర్ జర్నలిస్ట్ గాయం శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిన నేపథ్యంలో వివిధ నిబంధనలను అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, అభ్యర్థులు పాటించాలని, అధికార పార్టీ నేతలు అధికార దుర్వినియోగానికి పాల్పడకూడదని, పార్టీ కార్యకలాపాలకు పాలనా యంత్రాంగాన్ని వినియోగించకూడదన్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులు అధికారిక పర్యటనలు, పార్టీ ప్రచార పర్యటనలు రెండు కలిపి చేయకూడదని, ముఖ్యమంత్రి నుంచి మంత్రులు ఎమ్మెల్యేల వరకు ఎవరు ప్రభుత్వ వాహనాలను వినియోగించకూడదు. ముఖ్యమంత్రి కూడా అధికారిక హెలికాప్టర్ ను వినియోగించకూడదు. ఇంటి నుండి కార్యాలయానికి కార్యాలయం నుండి ఇంటికి తప్ప మరే ఇతర పనులకు ప్రభుత్వ వాహనాలను కోడ్ సమయంలో ఉపయోగించకూడదు. ఈ ఎన్నికల ప్రవర్తన నియమావళిని అన్ని పార్టీల అభ్యర్థులు తప్పకుండా పాటించాలని సూచించారు. ఎక్కడ, ఎవరు ఎన్నికల కోడ్ ను ఉల్లంఘించినా, అలాంటి వారిని తగిన ఆధారాలతో ఎలక్షన్ కమిషన్ కి ఫిర్యాదు చేయవచ్చు. ప్రభుత్వ వసతి గృహాలు, హెలిపాడ్లు, సభా స్థలాలు తదితర సౌకర్యాలు కేవలం అధికార పార్టీ వారి వినియోగానికి మాత్రమే కాకుండా, ఇతర పార్టీల వారికి కూడా అవకాశం కల్పించాలన్నారు. ఎలక్షన్ కోడ్ వెలువడిన తర్వాత ప్రభుత్వం నుంచి ఎటువంటి కొత్త పథకాలను ప్రకటించకూడదు. శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయకూడదు, రహదారుల నిర్మాణంపైన, తాగునీటి వసతులపై హామీలు ఇవ్వకూడదని గుర్తు చేశారు.



## వైభవంగా ఎంగిలి పూల బతుకమ్మ పండుగ

**దేవరుప్పుల, విశాల భారతి:** దేవరుప్పుల మండలం సింగరాజు పల్లి గ్రామంలో ఆడబిడ్డలందరు ఎంగిలి పూల బతుకమ్మ పండుగ అంగరంగ వైభవంగా పూలనే దేవతగా కొలిచే బతుకమ్మ పండుగ తెలంగాణ ఆత్మగౌరవానికి, ప్రత్యేక సాంస్కృతిక అస్తిత్వానికి ప్రతీకగా నిలిచే విధంగా బతుకమ్మ పండుగను తెలంగాణ రాష్ట్ర పండుగగా జరుపుకుంటూ తెలంగాణ సంస్కృతీ సాంప్రదాయాలను ఆటపాటలతో గొప్పగా గౌరవిస్తాం అని అన్నారు ఈ సందర్భంగా వారు తెలియజేస్తూ ఎంగిలి పూల బతుకమ్మతో మొదలై, ఉత్సవాల ముగింపు రోజైన సద్దుల బతుకమ్మ దాకా తొమ్మిది రోజుల పాటు ఆడబిడ్డలంతా ఆటా పాటలతో, కోలాట చప్పట్లతో కలిసికట్టుగా జరుపుకునే బతుకమ్మ సంబురాలతో, ప్రత్యేక పండుగ శోభ సంతరించుకుంటుందని.. ప్రకృతితో మమేకమైన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల ఔన్నత్యాన్ని బతుకమ్మ పండుగ విశ్వ వ్యాప్తంగా చాటుతుందని ఈ సందర్భంగా తెలిపారు.



# క్రీడా పోటీలను సద్వినియోగం చేసుకోవాలి

- సర్పంచ్ చింతకాయల ఉపేందర్

**మునగాల, విశాల భారతి:** మండల కేంద్రంలో దసరా పండుగ సందర్భంగా నిర్వహించే క్రికెట్ పోటీలను శనివారం మునగాల సర్పంచ్ చింతకాయల ఉపేందర్, బీసీ సంఘం నాయకులు చింతకాయల నాగరాజు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రీడాకారులు ఈ క్రీడా పోటీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కోదాడ డివిజన్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఎంవైసిసి టీమ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుంది. క్రీడా పోటీలలో నిర్వహిస్తున్న నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి జానిబాబా, జానుసుందర్, శ్రీను, ఎం ఆర్ సి , జాను, యాకూబ్, సుధాకర్, తిరపయ్య తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ పండుగకు గుర్తింపునిచ్చింది కేసీఆర్

- సూర్యాపేట అభివృద్ధికి నిదర్శనం సద్దుల చెరువు ట్యాంక్ బండ్
- తోటి మహిళలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు
- గుంటకండ్ల సునీత జగదీశ్ రెడ్డి



**సూర్యాపేట, విశాల భారతి:** ఏటా బతుకమ్మ పండగకు ప్రభుత్వమే పెద్దన్న లా చీరలు పెడుతున్న సంస్కృతి తెలంగాణలో మినహా ప్రపంచంలో మరి ఎక్కడా లేదని ఎస్ ఫౌండేషన్ చైర్మన్, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి సతీమణి గుంటకండ్ల సునీత జగదీష్ రెడ్డి పేర్కొన్నారు. సూర్యాపేటలోని తమ నివాసంలో ఆడపడుచులతో కలిసి సునీత జగదీశ్ రెడ్డి బతుకమ్మ వేడుకల్లో పాల్గొని బతుకమ్మ పాటలు పాడుతూ రంగు రంగుల పూలతో బతుకమ్మలను పేర్చారు. ఈ సందర్భంగా సునీత జగదీష్ రెడ్డి మాట్లాడుతూ మహిళల ఆరాధ్య పండగ అయిన బతుకమ్మ పండుగను రాష్ట్ర పండుగగా బతుకమ్మ గుర్తింపునిచ్చింది కేసీఆరే అన్నారు. అంతకుముందు ఎవరూ కూడా ఆ ఆలోచన చేయలేదని తెలిపారు. రాష్ట్ర మహిళల పక్షాన కెసిఆర్ కు ధన్యవాదాలు తెలిపారు. మహిళల కోసం సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన అనేక సంక్షేమ పథకాలే ఆయన మహిళా పక్షపాతి అనడానికి నిదర్శనం అన్నారు. కేసీఆర్ పాలనలోని మహిళలకు సముచిత గౌరవం లభించింది అన్నారు. సూర్యాపేట అభివృద్ధికి నిదర్శనం సద్దుల చెరువు ట్యాంక్ బండ్ అన్నారు. గత పాలకుల హయాంలో కంప చెట్లతో నిండి ఉన్న సద్దుల చెరువు ట్యాంకు బండ్ వద్ద బతుకమ్మ ఆడడానికి మహిళలు పడిన ఇబ్బందులు అన్నీ, ఇన్నీ కావన్నారు. తొమ్మిది రోజులపాటు జరిగే బతుకమ్మ వేడుకలు ఆనందోత్సవాలతో జరుపుకోవాలన్నారు. గౌరమ్మ ఆశీస్సులు ప్రతీ ఒక్కరికీ కలగాలని సునిత జగదీష్ రెడ్డి ఆకాంక్షించారు. వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ పెరుమాల అన్నపూర్ణమ్మ, గుండూరి పావని కృపాకర్, నిమ్మల స్రవంతి శ్రీనివాస్, సల్మా మస్తాన్, విజయ నాయక్, మాధవి, దండు రేణుక, ఢిల్లీ పావని, మాలి కవిత, వాంకుడోత్ పద్మ, లక్ష్మీ మకత్లాల్, అంజమ్మ, కరుణ శ్రీ, వనజ తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల ముమ్మర తనిఖీ



**నేరేడుచర్ల, విశాల భారతి :** తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల నగారా మోగడంతో సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా పోలీసులు ముమ్మర తనిఖీలను నిర్వహిస్తున్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పట్టణం చిల్లేపల్లి చౌరస్తా దగ్గర పట్టణ ఎస్సై పరమేష్ మరియు సిబ్బంది పర్యవేక్షణలో తనిఖీలు నిర్వహిస్తుండగా నేరేడుచర్ల మండలం కేతిరెడ్డి గూడెం గ్రామంకి చెందిన బొల్లం వీరయ్య తండ్రి లింగయ్య 1,20,000 వేల రూపాయలను సరైన పత్రాలు,ఆధారాలు చూపించక పోవడంతో సీజ్ చేసి ఎలక్షన్ కమిషన్ కు అందజేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా పట్టణ ఎస్సై పరమేష్ మాట్లాడుతూ ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందువలన ప్రజలు 50 వేల రూపాయల నగదు వరకూ మాత్రమే తీసుకువెళ్లాలని ఎక్కువ మొత్తంలో నగదు తీసుకువెళ్తే సరైన ఆధారాలు, పత్రాలు చూపించాలని తెలిపారు.



# మొక్కలు రక్షించే వారోత్సవం

**నేరేడుచర్ల , విశాల భారతి:** నీరు పోసి మొక్కలను బతికించండిఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని రక్షించండి అనే కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పురపాలక సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు శనివారం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మున్సిపాలిటీలో మొక్కలకు నీళ్లు పోసి వాటి సస్రక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు వర్షాలు లేకపోవడంతో మొక్కలు చనిపోతున్నాయని,అందుకే మొక్కలు రక్షించే వారోత్సవము అనే కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రతిపాదించారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వై వెంకటేశ్వర్లు,తహసీల్దార్ ఎన్. సైదులు,మేనేజర్ ఏ.అశోక్ రెడ్డి మున్సిపల్ సిబ్బంది మెప్మా సిబ్బంది మరియు ప్రజలు పాల్గొన్నారు.



# ఆడపడుచుల ఔన్నత్యాన్ని చెప్పే గొప్ప పండుగ బతుకమ్మ'

**తుంగతుర్తి , విశాల భారతి:** పూవ్వులను పూజించే ఆడపడుచుల ఔన్నత్యాన్ని చాటి చెప్పే గొప్ప పండగ బతుకమ్మ అని తుంగతుర్తి మండలం గానుగుబండ గ్రామ సర్పంచ్ నల్లు రామచంద్ర రెడ్డి అన్నారు. ఎంగిలి పూల బతుకమ్మతో మొదలై తొమ్మిది రోజులపాటు జరుపుకునే పండుగ బతుకమ్మ అన్నారు.శనివారం రోజున ఎంగిలి పూల బతుకమ్మ తో తొమ్మిది రోజుల పాటు తిరొక్క రంగుల తో అడపడుచులు జరుపుకొనే బతుకమ్మ పండగ ప్రారంభంసందర్బంగా సర్పంచ్ నల్లు రామచంద్రారెడ్డి మాట్లాడుతు తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు, ఔన్నత్యానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగను 9 రోజుల పాటు సంతోషంగా జరుపుకోవాలని 'తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు, ఆడపడుచుల ఔన్నత్యానికి ప్రతీకైన బతుకమ్మ పండుగను ప్రజలందరు సంతోషంగా జరుపుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఓబిసి అధ్యక్షుడు రుద్ర రామచంద్రు వార్డు మెంబర్లు కట్ల చంద్రయ్య, వీరబోయిన పద్మలింగయ్య,కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బోర జలంధర్, భూపతి వెంకటేష్, పోలేపక యల్లయ్య, పోలేపకసోమయ్య,గుండగాని సోమయ్య,కమలాకర్, వినోద్,వెంకన్న, బిక్షం, మహిళలు పాల్గొన్నారు.



# ఒక్కేసి పువ్వేసి చందమామ..

- తీరొక్క పూలతో బతుకమ్మలు పేర్చిన మహిళలు
- చిట్యాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**చిట్యాల,విశాలభారతి:** తెలంగాణ బతుకమ్మ పండుగ పూల సంబరాన్ని చిట్యాల పట్టణ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కనకదుర్గ గుడి దగ్గర, అలాగే 10వ వార్డు, వెంకటాపురం లో మహిళలు ఆత్మీయతకు అనుబంధానికి అద్దం పట్టేలా మహిళలందరు బతుకమ్మలతో ఓ చోట చేరి ఆటపాటలతో సందడి చేశారు.బంగారు గౌరమ్మ ఉయ్యాలో అంటూ ఒక్కేసి పువ్వేసి చందమామా అంటూ బతుకమ్మ పాటలతో భక్తితో బతుకమ్మ ఆడారు. అనంతరం అందంగా అలంకరించిన బతుకమ్మను పూజించిన మహిళలు చెరువుల్లో వాటిని వదిలిపెట్టారు. పోయిరా బతుకమ్మా అంటూ గౌరమ్మను తమ ఇంటికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పందిరి గీతా రమేష్, సిలువేరు మౌనిక శేఖర్, కనకదుర్గ దేవస్థానం కమిటీ సభ్యులు,మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ఘనంగా నిర్వహించారు.

# ఎన్నికల నియమావళిని సమర్ధవంతంగా అమలు చేస్తాం

- ఎన్నికల నిర్వహణకు పోలీసు సిబ్బందిని సిద్ధం చేశాం
- ఇతర శాఖల సమన్వయంతో ప్రణాళిక బద్ధంగా విధులు నిర్వహిస్తాం
- రాహుల్ హెగ్డే ఐపీఎస్, ఎస్పీ సూర్యాపేట



**సూర్యాపేట, విశాల భారతి:** సూర్యాపేట జిల్లా ఎస్పీగా బాధ్యతలు తీసుకున్న సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయం నందు ఎస్పీ రాహుల్ హెగ్డే ఐపిఎస్ మీడియా సమావేశం నిర్వహించారు. మీడియా ప్రతినిధుల పరిచయ కార్యక్రమం అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో మీడియా ప్రతినిధుల బాధ్యత చాలా ఉంటుందని సమన్వయంతో పని చేస్తూ వాస్తవాలను ప్రజలకు చేరవేయడంలో క్రియాశీలకంగా పని చేయాలని కోరారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల నిర్వహణకు పోలీసు సిబ్బంది సిద్ధంగా ఉన్నారు అని అన్నారు. శాంతియుత వాతావరణంలో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా పోలీసు బందోబస్తు నిర్వహిస్తాం అని తెలిపినారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని సమర్ధవంతంగా అమలు చేస్తాం, పౌరులు బాధ్యతగా నడుచుకోవాలి అని తెలిపారు. జిల్లాలో 1088 పోలింగ్ కేంద్రాలు ఉండగా 312 పోలింగ్ కేంద్రాలను క్రిటికల్ పోలింగ్ కేంద్రాలుగా గుర్తించడం జరిగినదని వీటి వద్ద ఎన్నికల నియమావళి నిబంధనల మేరకు సిబ్బందిని విధుల్లో నియమిస్తామని అన్నారు. చిమీర్యాల, బుగ్గమాదారం, మట్టపల్లి, పులిచింతల ప్రాజెక్ట్, దొండపాడు, మహంకాళి గూడెం, రామాపురం అడ్డ రోడ్ ప్రాంతాల్లో 7 అంతరాష్ట్ర సరిహద్దు చెక్ పోస్ట్ లు, మరో 7 అంతర్ జిల్లా చెక్ పోస్ట్ ఏర్పాటు చేశాం, వీటితో పాటుగా ఆకస్మిక తనిఖీలు, రైడ్స్ ఉంటాయని తెలిపినారు. నియోజకవర్గాల వారీగా సర్వే లైన్స్ టీమ్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ లు, మండలాల వారీగా ఎంసిసి, స్టాటికల్ టీమ్స్ విధులు నిర్వర్తిస్తారు అని అన్నారు. తనిఖీల్లో నగదు స్వాధీనం పూర్తి పారదర్శకంగా ఉంటుంది, నగదు తీసుకెళ్లడానికి సంభందించి పూర్తి ఆధారాలను కలిగి ఉండాలి అన్నారు. ఆయుధాలను డిపాజిట్ చేశాం, గతంలో ఎన్నికల్లో నేర చరిత్ర కలిగిన వ్యక్తులపై, రౌడీ షీటర్స్ ను ముందస్తు బైండోవర్ చేస్తున్నాం అన్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నుండి 1 కోటి 36 లక్షలు సీజ్ చేశాం, 10 తులాల బంగారం, 15 కేజీల సిల్వర్ సీజ్ చేశాం, 128.21 లీటర్ల మద్యం, 50 కేజీల నల్ల బెల్లం, 10 కేజీ పట్టిక, 126 కేజీల గంజాయి సీజ్ చేశాం అన్నారు. అలాగే ఎక్సైజ్ అధికారులతో కలిసి అక్రమ మద్యం సరఫరాను అడ్డుకుంటాం అన్నారు. సోషల్ మీడియా సైట్లను నిశితంగా పరిశీలిస్తున్నాం, ఎవరైనా ఇతరుల ను అగౌరవపరిచేలా, కించపరిచేలా పోస్టింగ్ లు చేసినా తప్పుడు సమాచారం ప్రచారం చేసినా చర్యలు తీసుకుంటాం అన్నారు.



# ఎంగిలిపూల బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న

- సర్పంచ్ గాలి రామకృష్ణ యాదవ్

**గరిడేపల్లి,విశాలభారతి :** మహిళలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలుపుతూ ,వెంకట్రాంపురం గ్రామంలో సర్పంచ్ గాలి రామకృష్ణ యాదవ్ కు మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. రామకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయలకు ఆడపడుచులు ఔన్నత్యానికి ప్రతీకైనా బతుకమ్మ పండుగను గ్రామ ప్రజలందరు సంతోషంగా జరుపుకోవాలని అన్నారు. బతుకమ్మ పండుగా సందర్భంగా గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ అమావాస్య నుండి తొమ్మిది రోజుల పాటు అడపచులు అందరూ కల్సి ఆడే గోప్ప పండగ బతుకమ్మ అని దేశంలోనే పూలను పూజించి,ప్రకృతి ని ప్రేమించే గొప్ప పండుగ బతుకమ్మ అని అలాంటి సంస్కృతి మన తెలంగాణ లో ఉందన్నారు.మహిళలను గౌరవిస్తూ వారి ఔన్నత్యాన్ని చాటి చెప్పే గొప్ప పండుగ బతుకమ్మ అన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక బతుకమ్మ పండుగను అధికారికంగా నిర్వహిస్తూ రాష్ట్ర పండుగగా గుర్తించిందన్నారు.ప్రతి ఏటా తెలంగాణ ప్రభుత్వం బతుకమ్మ కానుకగా ఆడపడుచులలు చీరల పంపిణీ చేస్తున్నామని చెప్పారు.ఈ పండుగను ప్రజలందరు వేడుకగా ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు చెవుల వీరబాబు యల్లబోయిన నాగరాజు మేకల రమణయ్య యల్లబోయిన అశోక్, మామిడి శ్రీను,కుర్ర మహేష్,చెవుల చిన్న సైదులు యల్లబోయిన రాంబాబు, కీసరి శివ,కుర్ర శివ,చెవుల వేణు, కుర్ర రామకృష్ణ ,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ వేడుకలో మాజీ ఎమ్మెల్యే వీరేశం

**నకిరేకల్ ,విశాలభారతి:** ఎంగిలి పువ్వు బతుకమ్మ పండుగ సందర్భంగా నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం పన్నాలగూడెంలోని స్వగృహం దగ్గర నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయానికి ప్రతీక బతుకమ్మ పండుగని అని అన్నారు. మహిళలందరికీ బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.





# ఘనంగా ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలు

**పాలకుర్తి, విశాల భారతి :** తెలంగాణ ప్రజలు ప్రత్యేకంగా జరుపుకునే పండుగ బతుకమ్మ. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక. ప్రకృతిని ఆరాధిస్తూ, తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచానికి చాటి చెప్పే పండుగే ఈ బతుకమ్మ పండుగ. ఈ నెల 14 నుంచి బతుకమ్మ పండుగకు తెలంగాణ రాష్ట్రం సిద్ధమవుతోంది. రోజూ బతుకమ్మను పేర్చి తొమ్మిది రోజులపాటు బతుకమ్మ ఆడేందుకు మహిళలు సిద్ధమవుతున్నారు. పాలకుర్తి మండల కేంద్రం లోని ఊర చెరువు దగ్గర మేయర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఏర్పాటు చేసిన బతుకమ్మ ఉత్సవాలలో భాగంగా ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్ పర్సన్ ఉషా దయాకర్ రావు బతుకమ్మ వేడుకల్లో పాల్గొని మహిళలతో కలిసి బతుకమ్మ ఉత్సవాలలో పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ వీరమనేని ఏకాంతరావు, ఎంపీటీసీ ఎడవెల్లి పురుషోత్తం, గ్రామ ప్రజలతో కలిసి ఎంగిలిపూల బతుకమ్మ ను వేడుకలను ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ వేడుకల కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పసునూరి నవీన్ కుమార్ ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

- నకిరేకల్ లో మహిళలతో బతుకమ్మ ఆడిన ఎమ్మెల్యే

**నకిరేకల్ విశాలభారతి:** నకిరేకల్ పట్టణంలో ఎంగిలిపువ్వు బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి , సాంప్రదాయలకు ఆడపడుచులు ఔన్నత్యానికి ప్రతీకైనా బతుకమ్మ పండుగను నియోజకవర్గ ప్రజలందరు సంతోషంగా జరుపుకోవాలని అన్నారు. అమావాస్య నుండి తొమ్మిది రోజుల పాటు అడపచులు అందరూ కల్సి ఆడే గోప్ప పండగ బతుకమ్మ అని దేశంలోనే పూలను పూజించి, ప్రకృతి ని ప్రేమించే గొప్ప పండుగ బతుకమ్మ అని అలాంటి సంస్కృతి మన తెలంగాణ లో ఉందన్నారు. మహిళలను గౌరవిస్తూ వారి ఔన్నత్యాన్ని చాటి చెప్పే గొప్ప పండుగ బతుకమ్మ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక బతుకమ్మ పండుగను అధికారికంగా నిర్వహిస్తూ రాష్ట్ర పండుగగా గుర్తించిందన్నారు. ప్రతి ఏటా తెలంగాణ ప్రభుత్వం బతుకమ్మ కానుకగా ఆడపడుచులలు చీరల పంపిణీ చేస్తున్నామని చెప్పారు.ఈ పండుగను ప్రజలందరు వేడుకగా , ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్, వివిధ హోదాలలో ఉన్న నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు జన్మదిన వేడుకలు

**శేరిలింగంపల్లి,విశాలభారతి:** హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు జన్మదిన వేడుకలను శనివారం హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని సమతా నగర్ కార్పొరేటర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పుట్టినరోజు సందర్భంగా డివిజన్ పరిధిలోని కాలనీల బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్పొరేటర్ కార్యాలయంలో కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు కి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వచ్చిన వారందరికీ భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..ఉప్పొంగిన ప్రేమకు తడిసిముద్దయ్యా ఆశీర్వదించిన అందరికి కృతజ్ఞతలని తెలిపారు.తన జన్మదినం సందర్భంగా డివిజన్ నాయకులు,అభిమానులు, కార్యకర్తలు,చూపిన ప్రేమ, ఆప్యాయతలు మీ దీవెనలు మరవలేనిదని,ఈ అభిమానం, ఆప్యాయత,ప్రేమ ఎల్లప్పుడూ నాపై ఇలాగే కొనసాగాలని మనసారా కాంక్షిస్తున్నానని శ్రీనివాసరావు పేర్కొన్నారు.


విశాల భారతి
vishalabharathi
Telugu Daily
ఆదివారం, 15.10.2023 | హైదరాబాద్





# ఘనంగా బతుకమ్మ వేడుకలు

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో... బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ బతుకమ్మ ఆడుతూ మహిళలు, యువతులు, పలుచోట్ల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. చేతిలో బతుకమ్మలతో వయోభేదం లేకుండా బతుకమ్మ ఆటలకు మహిళలు, యువతులు వేడుకల్లో పాల్గొని బతుకమ్మ పాటలతో ప్రతిధ్వనిస్తూ ఆ ప్రాంగణమంతా పండగ వాతావరణం నెలకొంది. సాంప్రదాయ దుస్తులు ధరించి రంగుల పూలతో బతుకమ్మలను పేర్చి బతుకమ్మ ఆడారు.












## మహేష్ నిర్ణయాలన్నీ మంచివే...!

సూపర్ స్టార్ మహేష్ బాబు గుంటూరు కారం సినిమా విషయంలో తీసుకున్న నిర్ణయాల పట్ల కొందరు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దర్శకుడు త్రివిక్రమ్ ఎంపిక చేసిన హీరోయిన్ పూజా హెగ్డేని కాదు అని ఆ స్థానం లో శ్రీలీలను నటింపజేయడం అనేది మహేష్ బాబు నిర్ణయం అనే విషయం తెల్సిందే. ఇక సంగీత దర్శకుడి విషయం లో కూడా మహేష్ నిర్ణయమే తుది నిర్ణయంగా టాక్ వినిపిస్తోంది. ఇక మహేష్ బాబు స్క్రిప్ట్ విషయంలో.. షూటింగ్ విషయంలో కూడా పలు కీలక ఇన్ పుట్స్ ఇచ్చాడని.. మహేష్ నిర్ణయాల వల్లే సినిమా షూటింగ్ ఆలస్యం అవుతుంది అంటూ వార్తలు వస్తున్నాయి. సోషల్ మీడియాలో మహేష్ బాబు నిర్ణయాల గురించి విమర్శలు చేస్తున్న వారికి ఆయన ఫ్యాన్స్ తగిన ఉదాహరణలతో కౌంటర్ ఇస్తూ ఉన్నారు. మహేష్ బాబు ఈ మధ్య కాలంలో చాల మెచ్యూర్డ్ గా ఆలోచిస్తున్నాడు. కనుక ఆయన తీసుకునే ప్రతి నిర్ణయం కూడా మంచిదే అన్నట్లుగా అభిప్రాయం వ్యక్తం అవుతోంది. మహేష్ బాబు ఆ మధ్య ఒక తమిళ్ స్టార్ దర్శకుడు రెండేళ్లు తన చుట్టూ తిరిగినా కూడా ఆయన దర్శకత్వంలో నటించేందుకు ఓకే చెప్పలేదు. తీరా ఆ సినిమా ను వేరే వారితో తీసిన ఆ దర్శకుడికి నిరాశే మిగిలింది. ఆ సినిమాలో మహేష్ బాబు నటించి ఉంటే ఇప్పుడు దక్కిన సక్సెస్ కూడా దక్కి ఉండేది కాదు. ఆ విషయం తనకు తెలుసు. అందుకే మహేష్ బాబు ముందే కథ తనకు నప్పదు అంటూ మంచి నిర్ణయం తీసుకున్నాడు. అంతే కాకుండా ప్రస్తుతం పూజా హెగ్డే క్రేజ్ గురించి తెల్సిందే. అలాంటి హీరోయిన్ ను నటింపజేయడం కంటే కొత్త హీరోయిన్ శ్రీలీల ను నటింపజేస్తే బాగుంటుందని మహేష్ తీసుకున్న నిర్ణయం కూడా సానుకూల ఫలితాన్ని ఇవ్వబోతుంది. కనుక మహేష్ ఏ నిర్ణయం తీసుకున్నా కూడా సినిమా హిట్ కే... ఫ్యాన్స్ ని మెప్పించడానికే అంటూ ఫ్యాన్స్ కొందరు సోషల్ మీడియా ద్వారా కామెంట్స్ చేస్తున్నారు.

## సీత ప్రేమలో ఉందట...!



ఉత్తరాది ప్రేక్షకులను తన అందంతో పాటు అభినయంతో మెప్పించిన ముద్దుగుమ్మ మృణాల్ ఠాకూర్. ఈ అమ్మడు తెలుగు లో సీతారామం సినిమా తో ఎంట్రీ ఇచ్చి మొదటి సినిమా తోనే స్టార్ గా నిలిచింది. హీరోయిన్ గా మృణాల్ ఠాకూర్ అందాల ఆరబోత సీతారామం సినిమాలో చేయకున్నా కూడా ఆ తర్వాత సోషల్ మీడియాలో అందాల విందు చేస్తూనే ఉంది. మొదటి సినిమా సీతారామం సక్సెస్ తర్వాత టాలీవుడ్ లో బ్యాక్ టు బ్యాక్ భారీ ఆఫర్లను ఈ అమ్మడు దక్కించుకుంటున్న విషయం తెల్సిందే. ఎప్పుడూ కూడా హాట్ ఫోటోలు లేదా ఏదో ఒక సినిమా విషయం తో వార్తల్లో నిలిచే మృణాల్ ఠాకూర్ ఈసారి తన ప్రేమ విషయాన్ని వెల్లడించడం ద్వారా వార్తల్లో నిలిచింది. మృణాల్ ఠాకూర్ ని ఎంతో మంది అభిమానులు ఆరాధిస్తూ ఉంటారు.. ఆమెను ప్రేమిస్తూ ఉంటారు. వారందరిది కూడా వన్ సైడ్ లవ్. అలాగే మృణాల్ కూడా ఒక వ్యక్తితో వన్ సైడ్ లవ్ లో ఉందట. ఈ విషయాన్ని స్వయంగా తాజా ఇంటర్వ్యూలో మృణాల్ తెలియజేయడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.



## మా ఊరి పోలిమేర 2 ట్రైలర్ లాంఛ్

మా వూరి పోలిమేర‘కు సీక్వెల్ గా రాబోతున్న చిత్రం మా వూరి పోలిమేర 2. శ్రీకృష్ణ క్రియేషన్స్ బేనర్ పై గౌరు గణబాబు సమర్పణలో గౌరికృష్ణ నిర్మాతగా రూపొందుతున్న ఈ చిత్రానికి డా.అనిల్ విశ్వనాథ్ దర్శకుడు. సత్యం రాజేష్, డా. కామాక్షి భాస్కర్ల, గెటప్ శ్రీను, రాకెండ్ మౌళి, బాలాదిత్య, సాహితి దాసరి, రవి వర్మ, చిత్రం శ్రీను, అక్షత శ్రీనివాస్ ముఖ్య పాత్రల్లో నటించారు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణనంతర పనులను జరుపుకుంటోంది. ఈ చిత్రం నవంబరు 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్ లో విడుదలకు సిద్ధమైంది. అయితే ఈ చిత్రాన్ని చూసి ఎంతగానో నచ్చిన ప్రముఖ పంపిణీదారుడు వంశీ నందిపాటి ఈ చిత్ర హక్కులను ఫ్యాన్సీ రేటుతో కొనుగోలు చేసి ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నారు. కాగా ఈ చిత్రం ట్రైలర్ విడుదల కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన దర్శకుడు హరీష్ శంకర్, హీరో కార్తికేయ, నిర్మాత బన్నీవాస్ లు ఈ చిత్రం ట్రైలర్ ను విడుదల చేశారు. హరీష్ శంకర్ మాట్లాడుతూ.... ఓటీటీలో పోలిమేర 1 బాగుందని చాలా మంది చెప్పారు. చూడగానే నాకు కూడా బాగా నచ్చింది. కంటెంట్ చాలా బలంగా వుంది. పోలిమేర 2 కూడా అదే తరహాలో బాగుంటుందని అనుకుంటున్నాను. ఈ చిత్రం తప్పకుండా ఆడియన్స్ కు సరికొత్త అనుభూతినిస్తుందనే నమ్మకం వుంది అన్నారు.

బన్నీవాస్ మాట్లాడుతూ ..నాకు నచ్చి నేను ఈ సినిమాకు సపోర్ట్ చేస్తాను. వంశీ చేస్తున్న తొలి సినిమా ఇది. 2018 సినిమాను చూసి తెలుగులో మనం విడుదల చేద్దామని సజెస్ట్ చేసిన వంశీ ఈ సినిమాను విడుదల చేస్తున్నాడు. అతని జడ్జ్ మెంట్ పై నాకు నమ్మకం వుంది. ఇది ఈ సినిమా అందరికి మంచి బ్రేక్ ఇవ్వాలని కోరుకుంటున్నాను. పోలిమేర2 కు బాగా ఆడాలని కోరుకుంటున్నాను. దర్శకుడు డా. అనిల్ విశ్వనాథ్ మాట్లాడుతూ హరీష్ శంకర్, కార్తికేయ, బన్నీవాస్ గారు ఈ వేడుకకు రావడం పాజిటివ్ గా అనిపిస్తుంది పార్ట్ 1కు మించి పార్ట్ 2 వుండబోతుంది. వంశీ నందిపాటి సినిమాను విడుదల చేయడం ఎంతో ఆనందంగా వుంది. ఈ సినిమాను పార్ట్ 1కు 100 రెట్లు ఎంజాయ్ చేస్తారు. బాలాదిత్య మాట్లాడుతూ నేను రాజేష్ సినీ పరిశ్రమకు వచ్చి 20 సంవత్సరాలైంది పోలిమేర చూసిన ప్రతి ఒక్కరూ పార్ట్ 2 ఎప్పుడూ అని అడిగారు. పార్ట్ 1కు మించి ఎన్నో రెట్లు అద్భుతంగా వుంటుంది. పార్ట్ 1ను చూడనివాళ్లు తప్పకుండా చూసి పార్ట్ 2కు వస్తే మీ మెదళ్లకు చాలా [illegible] వుంటుంది. ప్రతి సన్నివేశం ఎంతో అద్భుతంగా వుంటుంది. సినిమాలో [illegible] సర్ ప్రైజ్ లు ఈ సినిమాలో వుంటాయి. సత్యం రాజేష్ ఈ సినిమా[illegible] ఫార్మెర్ అని నిరూపించుకున్నాడు‘ అన్నారు. ఈ వేడుకలో ఖుషేందర్, శీను, కామాకి, సాహితి గ్యానీ తదితరులు పాల్గొన్నారు.

## ముంబైలో ప్రారంభమైన వృషభ కొత్త షెడ్యూల్



టాలీవుడ్ యంగ్ హీరో రోషన్ మేకా, మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ ప్రధాన పాత్రల్లో నటిస్తోన్న పాన్ ఇండియా మూవీ 'వృషభ'... 'ది వారియర్ అరైజ్' ట్యాగ్ లైన్. శనయ కపూర్, జహ్రా ఖాన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కనెక్ట్ మీడియా, బాలాజీ టెలీఫిల్మ్స్, ఏవీఎస్ స్టూడియోస్ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. నంద కిషోర్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. అభిషేక్ వ్యాస్, విశాల్ గుర్నాని, జుహి పరేఖ్ మెహతా, శ్యామ్ సుందర్, ఏక్తా కపూర్, శోభా కపూర్, వరుణ్ మథూర్, సౌరభ్ మిశ్రాలు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఏకకాలంలో తెలుగు, మలయాళీ భాషల్లో తెరకెక్కిస్తున్న ఈ మూవీని హిందీ, కన్నడ, తమిళ భాషల్లోనూ రిలీజ్ చేయబోతోన్నారు. రోజు రోజుకీ ఎక్స్‌పెక్టేషన్స్‌ను పెంచుకుంటూ అందరి దృష్టిని ఆకర్షిస్తోన్న ఈ సినిమా కొత్త షెడ్యూల్ శుక్రవారం ముంబైలో ప్రారంభమైంది. అక్టోబర్, నవంబర్ నెలల్లో ఈ భారీ షెడ్యూల్‌ను చిత్రీకరించేలా మేకర్స్ సన్నాహాలు చేశారు. షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. దసరా సందర్భంగా ఈ మూవీ రిలీజ్ డేట్‌ను అనౌన్స్ చేయబోతున్నట్లు దర్శక నిర్మాతలు ప్రకటించారు. వృషభ రిలీజ్ డేట్ ఎప్పుడు ఉంటుందనే ఆసక్తి అభిమానులతో పాటు సినీ లవర్స్, ట్రేడ్ వర్గాల్లోనూ క్రియేట్ అయ్యాయి. దసరా రోజున ఈ సస్పెన్స్‌కు తెరపడనుంది.

## డిసెంబర్ 2న గోవాలో సంతోషం అవార్డ్స్ వేడుక




జాతీయ సినిమా దినోత్సవం పురస్కరించుకుని సంతోషం సౌత్ ఇండియన్ ఫిలిం అవార్డుల ఈవెంట్ కి సంబంధించిన డేట్ అనౌన్స్ చేశారు ప్రముఖ అగ్ర కథానాయిక శ్రీలీల. ఈరోజు అధికారికంగా ఒక వీడియో రిలీజ్ చేస్తూ శ్రీ లీల ఈ సంతోషం సౌత్ ఇండియన్ ఫిలిం అవార్డుల ఈవెంట్ డిసెంబర్ 2 2023న గోవాలో అంగరంగ వైభవంగా జరగనుందని ఆమె పేర్కొన్నారు. ఇక గోవాలోని బాంబోలిం బీచ్ కు అతి చేరువలో ఉన్న డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఇండోర్ స్టేడియంలో ఈ అవార్డుల వేడుక ఘనంగా జరగనుంది. ఇక అదే సమయంలో గోవాలో ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ జరగనుంది. 150 దేశాల నుంచి సినీ ప్రేమికులు ఈ ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ ను ఈ వేడుకకు హాజరుకానున్నారు. ఇక ఆ దేశాల సినీ ప్రేమికులు, మన ఇండియన్ సినీ లవర్స్ మోహరించి ఉన్న గోవాలో వేలాది ప్రేక్షకుల మధ్య సంతోషం 22వ సౌత్ ఇండియన్ ఇండియన్ ఫిలిం అవార్డుల వేడుక జరగనుంది. ఈ వేడుకకు తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ మరియు బాలీవుడ్ కు చెందిన పలువురు సినీ రంగాలకు చెందిన అతిరథ మహారధులు హాజరు కానున్నారు.



## అతిలోక సుందరిలా జాన్వీ

అతిలోక సుందరి శ్రీదేవి కూతురుగా బాలీవుడ్ లోకి అడుగుపెట్టిన అందాల భామ జాన్వీ కపూర్. ఈ బ్యూటీ ధడక్ సినిమాతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చి తరువాత తండ్రి ప్రోత్సాహంతో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపుని సొంతం చేసుకునే ప్రయత్నం చేస్తోంది. వరుస సినిమాలు చేస్తూ వచ్చింది. అయితే బాలీవుడ్ లో ఇప్పటి వరకు స్టార్ హీరోలతో ఈ బ్యూటీ జతకట్టింది తక్కువ అని చెప్పాలి. ఊహించని విధంగా తెలుగులో మొదటి చిత్రమే ఏకంగా జూనియర్ ఎన్టీఆర్ తో రొమాన్స్ చేసే అవకాశాన్ని జాన్వీ కపూర్ సొంతం చేసుకుంది. కొరటాల శివ దర్శకత్వంలో జూనియర్ ఎన్టీఆర్ చేస్తోన్న దేవర మూవీలో జాన్వీ కపూర్ మెయిన్ హీరోయిన్. ఈ చిత్రం రెండు భాగాలుగా పాన్ ఇండియా స్థాయిలో భారీ బడ్జెట్ తో తెరకెక్కుతోంది. సినిమాల సంగతి పక్కన పెడితే జాన్వీ కపూర్ కి సోషల్ మీడియాలో విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. Also Read - నాని సినిమాలో మరో హీరో..? ఇన్ స్టాగ్రామ్ లో 22.1 మిలియన్ ఫాలోవర్స్ ని జాన్వీ కపూర్ కలిగి ఉంది. అత్యధిక ఫాలోవర్స్ ఉన్న ఇండియన్ సెలబ్రిటీ స్టార్స్ లో జాన్వీ టాప్ లో ఉంటుందని చెప్పొచ్చు. అందుకి ఈమె చేసే అండార్స్మెంట్స్ కి కోట్లలో ఆదాయం ఆర్జిస్తోంది. ఒక్క ఫోటో పెడితే లక్షల్లో లైక్స్ వస్తూ ఉంటాయి. ఫ్యాషన్ ఐకాన్ గా ఈ అమ్మడు రెగ్యులర్ గా హాట్ ఫోటో షూట్ లతో ఇన్ స్టాగ్రామ్ లో సందడి చేస్తూ ఉంటుంది. ఇప్పటికప్పుడు కొత్త కొత్త డిజైనర్ కాస్ట్యూమ్స్ తో ఫాలోవర్స్ కి కావాల్సినంత వినోదం అందిస్తూ ఉంటుంది. అందుకే ఇన్ స్టాలో జాన్వీని మిలియన్స్ లో ఫాలో అవుతారు. తాజాగా ఈ అమ్మడు లాంగ్ డిజైనర్ ఫ్రాక్ తో థిస్ అందాలు చూపిస్తూ హాట్ హాట్ ఫోజులతో కవ్విస్తోంది. ఈ ఫోటోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ఇప్పటి వరకు జాన్వీ షేర్ చేసిన ఈ ఫోటోలని 6.19 లక్షల మంది లైక్ చేయడం విశేషం. ఈ పిక్స్ లో జాన్వీ కపూర్ అతిలోక సుందరిలా, దివి నుంచి దిగివచ్చిన దేవకన్యలా ఉందనే మాట వినిపిస్తోంది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.